


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

15.08.2026
శనివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 46
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## సోషల్ మీడియాలో భాష జాగ్రత్త

- జనసేన శ్రేణులకు పవన్ వార్నింగ్
- వ్యక్తిగత దూషణలొద్దు
- వారి ట్రాప్‌లో పడొద్దని సూచన
- పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై
- పార్టీ శ్రేణులకు జనసేన అధినేత సూచనలు



2లో..

**అమరావతి, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

సోషల్‌మీడియాలో విభిన్నమైన అంశాలపై మాట్లాడే సమయంలో, పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ శ్రేణులకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదన్నారు. ప్రసార మాధ్యమాలు, సోషల్‌మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలు, జన సైనికులు, వీర మహిళలు కచ్చితంగా పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు.

## సీమాంధ్ర పాలకుల చెప్పుచేతుల్లో ప్రభుత్వం

- ప్రభుత్వంపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఫైర్
- రాష్ట్ర వ్యాప్తంగా కామెంట్లు వైరల్
- ఉద్యమకారులకు గౌరవం దక్కలేదు
- సీమాంధ్ర మీడియా చేతుల్లో ప్రభుత్వం



2లో..

## మా సహనం పరీక్షించొద్దు

- అజిత్ దోవల్ మాస్ వార్నింగ్
- ఆపరేషన్ సిందూర్‌పై తొలిసారి కామెంట్



5లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్**

పాకిస్తాన్‌పై భారత్ నిర్వహించిన ''ఆపరేషన్ సిందూర్''పై జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్ ఇచ్చిన తొలి ఇంటర్వ్యూ 'డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్' అనే డిస్కవరీ డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ప్రసారం కానుంది. రెండు భాగాలుగా వచ్చే ఈ డాక్యుమెంటరీ ఇది ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీ ఛానల్, దాని స్ట్రీమింగ్ సర్వీస్ అయిన డిస్కవరీ+లో ప్రసారం అవుతుంది.

# పులే దంపతుల స్ఫూర్తితో విద్యా విప్లవం



6లో..

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పులే విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుతో తలరాత మారి.. సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిబా పులే, సావిత్రిబాయి పులే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌కు.. సీఎం రేవంత్ రెడ్డి సంచలన కామెంట్లు

- రూ.2,400 కోట్లు ముందస్తుగా విడుదల
- విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- నైపుణ్యాలు సాధిస్తే విదేశాల్లో ఉద్యోగాలకు అవకాశం
- క్రీడల్లో రాణిస్తే ఉద్యోగం, భారీ నజరానాలు
- తెలంగాణలో బీసీ కులగణనతో చరిత్ర సృష్టించాం
- బలహీన వర్గాల యువత రాజ్యాధికారం దిశగా ఎదగాలి

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని చెప్పారు. ''ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుంది. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికే ప్రపంచం ఎర్ర తివాచీతో స్వాగతం పలుకుతోంది. అలాంటి వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయి. ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చింది. ఈ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలి. అందుకే విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం నేర్పిస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా పంపిస్తాం. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తాం''అని సీఎం అన్నారు.

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నెక్లెస్ రోడ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిబా పూలే, శ్రీమతి సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఒకవైపు అంబేద్కర్, మరోవైపు పూలే, ఇంకోవైపు ఇందిరా గాంధీ విగ్రహాల కలయికతో నెక్లెస్ రోడ్ చౌరస్తా మహనీయుల స్ఫూర్తి కేంద్రంగా మారిందని కొనియాడారు. 136 సంవత్సరాల తర్వాత కూడా మనం పూలేను గుర్తు చేసుకుంటున్నామంటే ఆయన ఎంత గొప్ప మార్గదర్శియో ఆలోచించాలని, ఆ మహనీయుల స్ఫూర్తితోనే ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు.

**ముందస్తుగా ఫీజు రీయింబర్స్‌మెంట్..**

విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదని, తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని సీఎం తెలిపారు.

## చర్యలు తీసుకోవడానికి ఎవరు?

- విద్యార్థులు శాంతియుతంగా నిరసన
- నిరసన తెలపడం విద్యార్థుల హక్కు
- ఇది విద్యార్థులకు, నాకు మధ్య జరుగుతున్న సంభాషణ
- ఇందులో వేరొకరు జోక్యం చేసుకోవద్దు

5లో..



## 'కడప స్మార్ట్ కిచెన్'కు నీతిఆయోగ్ గుర్తింపు

- కటింగ్ నుంచి కుకింగ్ వరకూ అంతా మెషీన్లే..
- మంత్రి నారా లోకేష్ నీతిఆయోగ్‌కు ధన్యవాదాలు
- విద్యార్థులకు పౌష్టికాహారం, రక్షణ సేవలు బలోపేతం



5లో..

**అమరావతి, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు నీతిఆయోగ్ నుంచి ప్రశంసలు దక్కాయి. దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ కడప జిల్లాలో స్మార్ట్ కిచెన్‌ను ఏపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. కడప స్మార్ట్ కిచెన్లపై నీతిఆయోగ్ ప్రశంసలు కురిపించింది. స్మార్ట్ కిచెన్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పంపిణీలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తోందంటూ ట్వీట్ చేసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా రోజూ 11 లక్షల మంది విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారని వివరించింది.

## అసెంబ్లీకి రా...నీకు నచ్చిన అంశంపై చర్చిద్దాం

- జగన్ కు మంత్రి సవిత సవాల్
- నీలా మేం దూషించం... అవమానించం
- ఒకరోజు కాకపోతే రెండ్రోజులైనా చర్చకు మేం రెడీ
- కళ్లున్న కబోదిలా .. ప్రెస్ మీట్ ల్లో మాట్లాడడం కాదు

2లో..



## పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

- వెలిగొండ నిర్వాసితులకు నెలాఖరులోగా 600కోట్లు ఇస్తాం
- విశాఖలో డేటాసెంటర్లకు 3 టిఎంసిల గోదావరి జలాలు
- 36 ప్రాజెక్టుల నెలవారీ వర్క్ ప్రోగ్రెస్ ఇవ్వాలని సిఎం ఆదేశించారు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

2లో..



## గీత దాటితే సహించేది లేదు

- రాజగోపాల్‌రెడ్డి అలా మాట్లాడటం సరికాదు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం
- ఇదే కాంగ్రెస్ విధానం రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం



**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదు'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.

2లో..

## మోదీ ఫొటో పెట్టేదాకా ఊకోం

- ఎంపీ రఘునందన్ రావు
- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ఉండాలి
- కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి..
- రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదు

2లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 14, అనంతనశక్తి న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు.

# సోషల్ మీడియాలో భాష జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

''వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకనుగుణంగానే స్పందించాలి. ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు గురికావొద్దు. అసభ్య పదజాలాన్ని వాడొద్దు. మహిళలను గౌరవించి మాట్లాడండి. పార్టీ అంతర్గత విషయాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడొద్దు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని ఉపేక్షించం. పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోనవ్వొద్దు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో చిక్కుకోవద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి. పార్టీ అభ్యున్నతి, కష్టపడి పనిచేసే వారి సంక్షేమం పార్టీ దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి'' అని పవన్ పిలుపునిచ్చారు.

ఈ క్రమంలోనే జనసేన శ్రేణులకు పవన్ కళ్యాణ్ పలు సూచనలు చేశారు. ఎవరూ కూడా వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లవద్దని సూచించారు. అలాగే □పార్టీల సిద్ధాంతాలు , మార్గదర్శకాలకి అనుగుణంగా స్పందించాలని స్పష్టం చేశారు. ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశానికి గురికావొద్దని.. అసభ్య పదజాలాన్ని వాడవద్దని ఆదేశించారు. మహిళలను గౌరవించి మాట్లాడాలన్న పవన్ కళ్యాణ్.. జనసేన అంతర్గత అంశాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడకూడదని స్పష్టం చేశారు. జనసేన భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడేవారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మరోవైపు జనసేన క్రమశిక్షణావళికి విఘాతం కలిగించేలా వ్యవహరించేవారు, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసేవారితో జాగ్రత్తగా ఉండాలని పార్టీ శ్రేణులకు పవన్ కళ్యాణ్ సూచించారు. అలాంటి వారి ప్రభావానికి లోను కావొద్దని.. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలని సూచించారు. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో పడొద్దని.. జనసేనలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. జనసేన పార్టీ కోసం కష్టించి పనిచేసేవారిని మరిచిపోనన్న పవన్ కళ్యాణ్.. సోషల్ మీడియాలో వచ్చే విష ప్రచారాలను తిప్పి కొట్టాలని సూచించారు.

మరోవైపు జనసేన పార్టీ ఎన్ఆర్ఐ ప్రతినిధిని ఉద్దేశించి.. ఒంగోలుకు చెందిన జనసేన నాయకుడు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై సదరు నేత ఇప్పటికే క్షమాపణలు కూడా తెలియజేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇలాంటి ప్రకటన రావటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సీమాంధ్ర పాలకుల చెప్పుచేతుల్లో ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణలో ప్రజా పాలన అన్నప్పుడు తెలంగాణ ఉద్యమకారులకు, ఆది నుంచి ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు గౌరవం దక్కాలేగానీ సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పు చేతుల్లో కాంగ్రెస్ పార్టీ గానీ, ప్రభుత్వం గానీ ఉండొద్దని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. శుక్రవారం చౌటుప్పల్లో జరిగిన సీతా రామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన రాజగోపాల్ రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్లు, రాహుల్ గాంధీ నాయకత్వంలో కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు. తాను ఎక్కడా కాంగ్రెస్ పార్టీని విమర్శించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో బయటి నుండి వచ్చిన వ్యక్తుల ఆధిపత్యం పెరిగి నిజమైన కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందనేదే తమ బాధ అన్నారు. తెలంగాణ ఉద్యమం నడిచిందే ఆత్మగౌరవం కోసం, అట్లాంటప్పుడు ఇక్కడి ప్రజల ఆత్మగౌరవం నిలిచేలా ప్రజా పాలన ఉండాలని తెలిపారు.

**నిజమైన కార్యకర్తలకు, నేతలకు అన్యాయం చేయొద్దు**

ప్రభుత్వం పేదల కోసం పని చేయాలి. అంతేకానీ కాంట్రాక్టర్ల కోసం, పెట్టుబడిదారుల కోసం పని చేయకూడదన్నారు. ఇలాంటి వాటితో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో బలహీనపడవద్దనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ సైనికుడిగా తాను మాట్లాడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ వచ్చింది, కాంగ్రెస్ పార్టీతోటే పేదలకు న్యాయం జరుగుతుంది, కాంగ్రెస్ పార్టీ తోటే తెలంగాణ అభివృద్ధి అవుతుందని అదీ రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతుందన్నారు. బయట నుండి వచ్చి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు, నేతలకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి, కాంగ్రెస్ పార్టీలో ఉన్నోళ్లనే అణిచివేయాలని, అగౌరవ పరచాలని, అవమానించాలని చూస్తే సహించేది లేదని రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు.

**ఆ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు.

**ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి..**

తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# మంత్రి నారాయణ చంద్రబాబుకు రిలీఫ్

అమరావతి, ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్

అమరావతి ల్యాండ్ పూలింగ్ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పి. నారాయణకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. వీరిద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. చంద్రబాబు, పి. నారాయణపై 2021లో నమోదైన క్రిమినల్ కేసును జూలై 15న ఏపీ హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది. 2021 మార్చి 12న ఏపీ సీఐడీ ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే ప్రభుత్వ విధాన నిర్ణయాలు తీసుకోవడం, వాటికి సంబంధించి జీవోలు జారీ చేయడాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని క్రిమినల్ కుట్రగా పరిగణించలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

**సుప్రీంకోర్టులో ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్**

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే కారణాలు కనిపించడం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇక, అమరావతి ల్యాండ్ పూలింగ్ వ్యవహారానికి సంబంధించిన ఈ తీర్పు ఇతర కేసులపై ప్రభావం చూపదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆయా కేసులను వాటి స్వంత మెరిట్స్ ఆధారంగా నిర్ణయించాలని పేర్కొంది. దీంతో ఇతర కేసుల్లోని అంశాలను ఈ తీర్పుతో ముడిపెట్టకూడదని ధర్మాసనం స్పష్టం చేసినట్లయింది.

**రాజకీయ పోరాటాలను కోర్టులో చేయొద్దు**

విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో న్యాయస్థానం అవసరమైన రక్షణ కల్పిస్తుందని స్పష్టం చేశారు. అయితే రాజకీయ పోరాటాలను కోర్టుల వేదికగా చేయకూడదని వ్యాఖ్యానించారు. రైతుల హక్కులు, ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకుంటాయని, అయితే రాజకీయ వివాదాలను న్యాయపరమైన పోరాటాలుగా మార్చడం సరికాదని సూచించారు.

# మోదీ ఫొటో ఎందుకు పెట్టరు?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.



# పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

విజయవాడ ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్

పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు లతో పాటు మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు, ఐడిసి లిఫ్ట్స్ స్కీం, వంటి అంశాలతో పాటు, ఎల్ నినో వచ్చినటువంటి సందర్భంలో త్రాగునీటి అవసరాల నిమిత్తం ఏ రకంగా ప్రణాళిక తీసుకుంటూ ఉన్నాం, అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశంలో చర్చించడం జరిగిందని తెలిపారు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**పోలవరం వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్.**

పోలవరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ 90% పూర్తయిందని, భూసేకరణ 94% పూర్తిచేశామని, అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తరలింపు 52% పూర్తయిందని, ఇలా మొత్తం పోలవరం ప్రాజెక్టు ఈనాటికి 77% పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, అదేవిధంగా భూసేకరణకు సంబంధించి, కాలనీలకు సంబంధించిన పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా... అంటే ప్రాజెక్టును ప్రారంభించడానికి ఒక ఆరు నెలలు ముందుగానే ఒక షెడ్యూల్ ని కూడా రూపొందించుకుని, ఆ షెడ్యూల్ ప్రకారం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాలనీలు పూర్తి కావాలని సిఎం చంద్రబాబు నాయుడు గారు ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా పోలవరం అనేది ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుగానే కాదు, భవిష్యత్తులో ఒక టూరిజం హబ్ గా కూడా చేసేవిధంగా, 10,000 ఎకరాలతో రేడియల్ సర్వే చేసి, అభివృద్ధి చేయడంతో పాటు, పోలవరం స్పిల్ వే కి సంబంధించి బ్యూటిఫికేషన్, అదేవిధంగా కనెక్టివిటీ బ్రిడ్జ్ ని కూడా ఐకానిక్ మోడల్ లో తయారు చేసుకోవడం, హైవేస్ కనెక్టివిటీ గాని, పోలవరం ప్రాజెక్ట్ నుంచి భద్రాచలం వరకు కూడా రివర్ బేస్డ్ టూరిజాన్ని అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు.

**2027 మార్చి నాటికే పోలవరం పూర్తి.**

ఈవిధంగా పోలవరం ప్రాజెక్టుకు వాస్తవంగా ఇచ్చినటువంటి షెడ్యూల్ 2027 డిసెంబర్, కానీ చంద్రబాబు నాయుడు గారు పుష్కరాలు వస్తూ ఉన్నాయి కాబట్టి, పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయండి, మార్చి నెలకే అని ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారమే ఈ 2027 మార్చి కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యంగానే పనులు జరుగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవల మొదటి సారి, గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినటువంటి పరిస్థితిలో కూడా పనులు ఆగకుండా జరుగడం పట్ల సిఎం చంద్రబాబు అభినందించారని తెలిపారు. అందుకే గ్యాప్1 ఈసిఆర్ఎఫ్ పనులు 48%, గ్యాప్2 ఈసిఆర్ఎఫ్ పనులు 36% పూర్తయ్యాయని వివరించారు. ఈవిధంగా ఈసిఆర్ఎఫ్ డిజైన్స్ ప్రకారం 45.72 మీటర్లకు పూర్తి చేసుకోగలుగుతున్నామని, ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణం వల్ల ఆప్రాంతంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న గండిపోచమ్మ దేవాలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని సిఎం ఆదేశించారని అన్నారు మంత్రి నిమ్మల. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసేసి, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేము అన్నటువంటి దశ నుంచి, 2027 కల్లా పోలవరాన్ని పూర్తి చేస్తున్నాము అనేటువంటి భరోసాను ప్రజలకు కల్పించామని స్పష్టం చేశారు. అదేవిధంగా పోలవరంకి సంబంధించినటువంటి లెఫ్ట్ మెయిన్ కెనాల్ (LMC) 2019 2024 ఐదు సంవత్సరాల్లో కి సంబంధించి ఎక్కడా కూడా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఉత్తరాంధ్రాకి సాగునీరు, తాగునీరు, విశాఖపట్నానికి పారిశ్రామిక అవసరాలకు సైతం నీళ్ళిచ్చేటువంటి, పోలవరం ఎడమ ప్రధాన కాలువని ఐదు సంవత్సరాలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి, ఆ ప్రాజెక్టుని నీరుగారిస్తే, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1500 నుండి 1800 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, ఎల్ఎంసి (లెఫ్ట్ మెయిన్ కెనాల్) చాలా క్రిటికల్ వర్క్స్ తో పాటు, 11 చోట్ల నేషనల్ హైవేస్ క్రాస్ చేసేటటువంటి క్రిటికల్ వర్క్స్ ని సైతం అధిగమించామని అన్నారు. పంపా, తాండవ, ఏలేరు రిజర్వాయర్, అదేవిధంగా వరాహ, ఇటువంటి నదులను అన్నీ కూడా, క్రాస్ చేసేటటువంటి కెనాల్ వర్క్స్ గాని, ఇలా క్లిష్టమైన పనులను కేవలం రెండేళ్ళలోనే పూర్తి చేసుకుని, ఈ నెలాఖరు కల్లా ఆ పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుండి నీటిని విడుదల చేసి, ఉత్తరాంధ్రాకి అనకాపల్లి వరకు కూడా గోదావరి జలాలు తీసుకెళ్లే పనులు పూర్తి చేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు.

**విశాఖ డేటా సెంటర్లకు గోదావరి జలాలు.**

కొంతమంది గొడ్డలి పార్టీ నాయకులు మాట్లాడుతూ విశాఖపట్నంలో గూగుల్ తో పాటు వచ్చే ఇతర డేటా సెంటర్స్ కు నీళ్లే లేవని మాట్లాడుతూ ఉన్నారు. వాళ్ల పరిపాలన ఉంటే అట్లానే ఉంటుంది. కానీ ఈరోజు పరిపాలన కూటమి ప్రభుత్వ పరిపాలన, చంద్రబాబు నాయుడు గారి పాలన. ఈరోజు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ తోటి విశాఖకి గాని, ఉత్తరాంధ్రాకి గాని పుష్కలంగా నీరు వస్తుంది. గూగుల్ గాని, ఇతర డేటా సెంటర్స్ గాని మొత్తం సంవత్సరానికి మూడు టిఎంసి ల నీళ్లు అవసరం అవుతాయని, ఆనీటిని పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అందిస్తామని అన్నారు.

**వెలిగొండ నిర్వాసితులకు 600 కోట్లు క్లియర్ చేయబోతున్నాం.**

మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు. ఆ వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కూడా హెడ్ రెగ్యులేటర్స్, టన్నెల్స్ లో లైనింగ్, బెంచింగ్, ఫీడర్ కెనాల్ కి సంబంధించినటువంటి సిసి వాల్, ఫీడర్ కెనాల్ సిసి లైనింగ్, నల్లమల సాగర్ కి సంబంధించినటువంటి రెగ్యులేటర్స్ పనులన్నిటినీ కూడా ఈ నెల 25కి పూర్తి చేసుకుంటూ, దానితో పాటుగా. టన్నెల్ 2 లో చిక్కుకున్నటువంటి టిబిఎమ్ మిషన్ కూడా, దగ్గర దగ్గర 1900 టన్నుల ఐరన్ కి గానూ, ఇప్పటికీ 1500 టన్నులు తొలగించామని చెప్పారు. మిగిలిన బ్యాలెన్స్ 400 టన్నులని కూడా డిస్మాంటిల్ చేసి అది కూడా కటింగ్ అవ్వకపోతే మళ్లీ గ్రానైట్ కటింగ్ మిషన్ తో సహా, డైమండ్ కటింగ్ మిషన్ ని కూడా తీసుకొచ్చి దానికి కూడా ట్రయల్ చేసి... ఇలా ఇన్ని కష్టాల మధ్య అర్ధరాత్రి కూడా షిఫ్టులు పెట్టుకుని పనులు జరుగుతూ ఉన్నాయి అని అన్నారు. ఇలా ఉంటే, గత ముఖ్యమంత్రేమో, వెలిగొండ పూర్తయిపోయిందని జాతికి అంకితం చేసేసానని ఒక దగా, మోసం చేశాడని, 2026 ఆగస్టు లో కూడా రాత్రి పగలు తేడా అనేది లేకుండా డే అండ్ నైట్ వెలిగొండ పనులు జరుగుతూ ఉన్నాయని వివరించారు.

అదేవిధంగా వెలిగొండ నిర్వాసితులకు గత ఐదేళ్ల పాలనలో 900 కోట్ల రూపాయలు ఆర్ అండ్ ఆర్ ఇవ్వాల్సి ఉంటే, ఐదు సంవత్సరాల్లో ఒక్క చిల్లి గవ్వ, ఆ నిర్వాసితులకి ఇవ్వడానికి జగన్ కు మనసు రాలేదని, కానీ జాతికి అంకితం అంటూ, దగా, మోసం చేశాడని దుయ్యబట్టారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆర్ అండ్ ఆర్ కి సంబంధించి ఇటీవలే 318 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగింది. మిగిలినటువంటి నిర్వాసితులకు ఇవ్వవలసిన 600 కోట్లను 17వ తారీకు నుంచి ఒక షెడ్యూల్ ప్రకారం 24వ తేదీ లోపల ఇవ్వాలని చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం జరిగింది అని పేర్కొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించి చిన్న చిన్న సమస్యలు కూడా గురువారం మార్కాపురం కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో గుర్తించి, వాటిని కూడా మానవతా దృక్పథంతో ఎంతవరకు వాళ్లకు సహాయం చేయగలిగితే అంతవరకు కూడా సహాయం చేయమని చంద్రబాబు నాయుడు గారు చెప్పడం జరిగింది అని అన్నారు. ఆ రకంగానే హ్యూమన్ గ్రౌండ్స్ లో జెన్యూన్ గా ఎవరైతే ఉంటారో వాళ్లందరికీ కూడా న్యాయం చేసేటటువంటి బాధ్యత కూడా ఈ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చెప్పారని స్పష్టం చేశారు.

**ఇరిగేషన్ క్యాలెండర్ తో పాటు ప్రాజెక్టుల వర్క్ షెడ్యూల్ ఇవ్వాలి.**

ఇదేవిధంగా హంద్రీనీవా, ఎల్ఎంసి (లెఫ్ట్ మెయిన్ కెనాల్), వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఒక షెడ్యూల్ ఇచ్చాం, ఆ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తూ ఉన్నాం అని, తరువాత పోలవరం ప్రాజెక్టు 2027కి షెడ్యూల్ పెట్టి పూర్తి చేస్తూ ఉన్నాం అని అన్నారు. భవిష్యత్తులో కూడా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులని పూర్తి చేయడానికి, ఇరిగేషన్ క్యాలెండర్ ని రూపొందించి, ఆ ఇరిగేషన్ క్యాలెండర్ లో ఉన్నటువంటి ప్రాజెక్టుల యొక్క ప్రగతి కూడా నెలావారీ ప్రణాళిక వేసుకుని... నెలావారీ ప్రణాళిక తోపాటు, వర్క్ ప్రోగ్రెస్. ఏ నెలకానెల కూడా ఆ 36 ప్రాజెక్టుల మీద కూడా త్వరగా ఇవ్వాలని సిఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నిమ్మల తెలిపారు.

**ఐడిసికి పూర్వ వైభవం తీసుకొస్తున్నాం.**

గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1040 లిఫ్టులు ఉంటే, అందులో పూర్తిస్థాయిలో పనిచేసేవి కేవలం 150 లిఫ్టులు మాత్రమే. 8 లక్షల ఎకరాల ఆయకట్టు లిఫ్టు స్కీం ల ద్వారా సాగవుతుండగా, ఈ స్కీంలు నిర్వీర్యమైపోవడంతో సగానికి పైగా సాగుదెబ్బతింది. ఐదు సంవత్సరాల గత గొడ్డల పార్టీ పాలనలో ఆ లిఫ్టుల్ని నిర్వీర్యం చేసేస్తే రైతులందరూ కూడా వ్యవసాయం వదులుకున్నటువంటి పరిస్థితి. అటువంటి స్థితిలో ఆ లిఫ్టులన్నింటినీ కూడా ప్రభుత్వమే తీసుకుని, ప్రభుత్వమే ఆ లిఫ్టుల్ని బాగుచేయడానికి, అదేవిధంగా రిపేర్లు చేయడంతో పాటు, ఇంకొక 10 సంవత్సరాల పాటు ప్రభుత్వమే ఓ అండ్ ఎమ్ కూడా చేసేటటువంటి విధంగా కూడా ముందుకు వెళ్లమని చెప్పి కూడా సిఎం చంద్రబాబు ఆదేశించడం జరిగిందన్నారు. దాని ప్రకారమే రాబోయేటటువంటి రోజుల్లో ఆ లిఫ్టులన్నిటినీ కూడా ప్రభుత్వమే ఆ రిపేర్లు చేయడంతో పాటుగా 10 సంవత్సరాల పాటు మెయింటెనెన్స్ చేసేటటువంటి విధంగా కూడా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**తాగునీటికే మొదటి ప్రాధాన్యత.**

ఎల్ నినో, సూపర్ ఎల్ నినో నేపథ్యంలో త్రాగునీటికి ప్రథమ ప్రాధాన్యతని ఇవ్వాలని, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కూడా సూచనలు చేసిందని, 2027 జూన్ వరకు కూడా ఇప్పుడు ఉన్నటువంటి నీటిని భద్రపరుచుకోవాలని సూచించిందని తెలిపారు. దీన్నే మనము కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ కూడా ఇరిగేషన్, రెవెన్యూ, అగ్రికల్చర్, ఈ మూడు డిపార్ట్‌మెంట్లని కూడా కోఆర్డినేట్ చేసుకుంటూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజలని, రైతులని ఎప్పటికప్పుడు ఎడ్యుకేట్ చేసుకుంటూ ఇచ్చేటటువంటి నీళ్లు తాగునీటికే ఉపయోగించుకోవాలి. తాగునీటి అవసరాలని మించి ఎక్కడైనా నీళ్లు ఉంటే అది ఆరుతడి పంటలకు మాత్రమే ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. ఒక్క గోదావరి డెల్టాకు మాత్రమే ఈ ఖరీఫ్ కి వరి సాగుకి ఇస్తున్నామో, మిగిలిన ప్రాంతాల్లో త్రాగునీటికే ప్రాధాన్యత. ఆ త్రాగునీటి కి మించి ఎక్కడైనా మనకు ఉంటే అది ఆరుతడి పంటలకు మాత్రమే వెళ్లాలి తప్ప మరి వేరే వాటికి ఉపయోగించరాదని స్పష్టం చేశారు.

# అసెంబ్లీకి రా...నీకు నచ్చిన అంశంపై చర్చిద్దాం

పులివెందుల/కడప ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్

'కళ్లున్న కబోదుల్లా మాట్లాడడం కాదు... ప్రెస్ మీట్లు పెట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా... రాయలసీమ, పులివెందుల అభివృద్ధి, మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల్లో అక్రమాలు... మీకు నచ్చిన ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం. గతంలో టీడీపీ సభ్యులను, వారి కుటుంబ సభ్యులను మీరు దూషించినట్లు మీ కుటుంబ సభ్యులను మేం దూషించం... గౌరవంగా సభను నిర్వహిస్తున్నాం...ఒకరోజు కాకుంటే రెండ్రోజులు చర్చిద్దాం... సభకు రా..' అని జగన్ ను జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రజలు మాత్రమే, తాము కాదని అన్నారు. పులివెందుల ప్రజలు ఎమ్మెల్యేగా జగన్ కు అవకాశమిచ్చారని, తమ నియోజకవర్గవాసుల ఆకాంక్షలను నెరవేర్చేలా అసెంబ్లీకి రావాల్సిన బాధ్యత ఆయన ఉందన్నారు. గ్రూప్ 1 జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చడానికే జగన్, ఆయన బ్యాచ్ మెగా డీఎస్సీలో అక్రమాలంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కడప జిల్లాలో రూ.220 కోట్లకుపైగా ఆర్ అండ్ బి రోడ్లు, ఇతర రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఆ పనులన్నీ 80 శాతం పూర్తి కావొచ్చాయని, మిగిలిన 20 శాతం త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. పులివెందులలో ఒకరోజు పర్యటన నిమిత్తం వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత... మరో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి ఆర్ అండ్ బి రహదారులు, బీసీ సంక్షేమ పథకాలపై శుక్రవారం సమీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవితో కలిసి మంత్రులు మాట్లాడారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంతో పాటు రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రైజింగ్ రాయలసీమే లక్ష్యంగా ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తూనే, మరోవైపు పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. కర్నూలు, ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తూ, రాయలసీమను పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**మెగా డీఎస్సీపై డైవర్షన్ పాలిటిక్స్**

తాను చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోడానికి జగన్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను సిట్ బట్టబయలు చేసిందన్నారు. ఈ అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ జగన్, ఆయన బ్యాచ్ పెద్ద డ్రామాకు తెరతీసిందన్నారు. గొడ్డలి పార్టీ నాయకులు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. చివరికి విద్యార్థులను, కూలీలను ధర్నాలకు తరలించే దుస్థితికి వైసీపీ నాయకులు దిగజారిపోయారని మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

**అసెంబ్లీకి రా...నీకు నచ్చినంత సమయం ఇస్తాం**

తమకు ప్రతిపక్ష హోదా లేదని, అందుకే శాసనసభకు వెళ్లడం లేదని జగన్ అనడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత అన్నారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది కూటమి ప్రభుత్వం కాదని, ప్రజలను స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ కు ఈ విషయం తెలియదా..? అని ప్రశ్నించారు. కళ్లున్న కబోదుల్లా మాట్లాడడం కాకుండా, ప్రెస్ మీట్లు పెట్టడం కాకుండా దమ్ముంటే అసెంబ్లీకి రావాలని జగన్ కు మంత్రి సవిత సవాల్ చేశారు. ఆయనకు నచ్చిన అంశంపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాయలసీమ, పులివెందుల అభివృద్ధి, మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల్లో అక్రమాలు... ఇలా ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైసీపీ హయాంలో టీడీపీ సభ్యులను, వారి కుటుంబ సభ్యులను గొడ్డలి పార్టీ నాయకులు దూషించినట్లు తమ వ్యవహరించబోమన్నారు. జగన్ కుటుంబ సభ్యుల ఊసే ఎత్తబోమని, సభను ఇంటిల్లపాది చూసేలా గౌరవంగా సభను నిర్వహిస్తున్నామన్నారు. జగన్ కు ఎంతసమయం కావాలంటే అంత సేపు మైక్ ఇస్తామని, ఒకరోజు కాకుంటే రెండ్రోజులు చర్చిద్దామని, సభకు రావాలని కోరారు.

**గడువులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సిందే...**

అంతకుముందు పులివెందుల ఆర్ అండ్ గెస్ట్ హౌస్ లో కడప జిల్లాలో రోడ్ల నిర్మాణాలపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి మంత్రి సవిత సమీక్షించారు. ఏయే ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో..? అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, దీన్ని అనుకూలంగా తీసుకుని సకాలంలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందులున్నా రహదారుల నిర్మాణానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డును కూడా నిర్మించలేదన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి సవిత గుర్తు చేశారు.

**అర్హులైన నేతన్నలందరికీ ఆర్థిక సాయం**

అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం కింద రూ.25 వేలు ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఇంకా అర్హులు ఉంటే గుర్తించి, వారికి కూడా నేతన్నల సేవలో పథకాన్ని వర్తింపజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపైనా మంత్రి సవిత సమీక్షించారు. విద్యార్థులను కంటికి రెప్పల చూసుకోవాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో తాజా ఆహారం, వేడి చేసి చల్లార్చిన నీటిని అందివ్వాలన్నారు. బయట ఆహారం హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాల్లోకి అనుమతివ్వొద్దని స్పష్టం చేశారు. హాస్టళ్లను, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వచ్చే టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలను రాబట్టడానికి ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశాల్లో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేశ్ రెడ్డి, పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి, ఆర్ అండ్ బి, బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# గీత దాటితే సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు తెరపైకి వచ్చాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారగా..వాటిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణను ఎవరూ ఉల్లంఘించరాదని.. గీత దాటితే ఎంతటి నాయకుడైనా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

ఈ వ్యవహారాన్ని ఏఐసీసీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి.. ఆ తర్వాత చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి నుంచి సాధారణ కార్యకర్త వరకు అందరికీ ఒకే విధమైన రూల్స్ వర్తిస్తాయని తేల్చి చెప్పారు. పార్టీపై బహిరంగంగా విమర్శలు చేయడం క్రమశిక్షణారాహిత్యంగా పరిగణించాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు.

అయితే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామనే హామీ ఇచ్చారని జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఎన్నికల సమయంలో ఏదైనా హామీ ఇచ్చి ఉండొచ్చని.. అయితే మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలి అనేది పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి నాయకుడి కోరికను ఒకేసారి నెరవేర్చడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఇక పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని పేర్కొన్న మహేశ్‌కుమార్ గౌడ్.. సమిష్టి నిర్ణయాలతోనే ముందుకు సాగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల ఆధిపత్యం పెరగడం వల్ల.. అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు కూడా గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# పోలవరం పనులు స్పీడప్ చేయాలి

అమరావతి, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పురోగతి, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్న 36 ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. లోటు వర్షపాతం నేపథ్యంలో రాష్ట్రంలో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలు, నీటి నిర్వహణ ప్రణాళికపై సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. జలధార, జలహారతి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసి నీటి వనరులను సంరక్షించడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానిక ప్రజల సెంటిమెంట్‌కు ఎలాంటి భంగం కలగకుండా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులతో పాటు స్థానిక విశ్వాసాలు, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని నీటి వనరుల సమర్థ నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, భవిష్యత్ తాగు, సాగునీటి అవసరాలపై సమీక్షలో సమగ్రంగా చర్చ జరిగింది. పోలవరం పనులను నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయడంతో పాటు అనుబంధ మౌలిక వసతులను కూడా సమాంతరంగా అభివృద్ధి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అధునాతన అగ్నిమాపక వాహనాలు ప్రారంభం**

రాష్ట్ర అగ్నిమాపకశాఖలోకి మరికొన్ని ఆధునిక వాహనాలు రానున్నాయి. తాజాగా 58 ఆధునిక ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు.. 20 వాటర్ బౌజర్లు.. 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను లాంచ్ చేశారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలను అగ్నిమాపక శాఖ సమకూర్చుకుంది. భారీ అగ్నిప్రమాదాల్లో మంటలను అదుపు చేయడానికి అవసరమయ్యే నిరంతర నీటి సరఫరాకు 20 వాటర్ బౌజర్లు కొనుగోలు చేసింది. ఇరుకైన, రద్దీ ప్రాంతాల్లోకి వేగంగా చేరుకునేలా 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలు పనిచేస్తాయి. తొలి దశలో ఇప్పటికే రూ.33 కోట్లతో 65 ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వాహనాల ప్రత్యేకతలను అధికారులు సీఎంకు వివరించారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.



# జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలు.. నోటిఫై చేసిన ప్రభుత్వం



హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, లద్దాఖ్‌లతో పాటు కొన్ని ప్రాంతాల్లో సెప్టెంబర్ 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలోనే జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. వీటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉప కులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు.

ఈ ప్రాంతాలలో జనాభా గణన సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతుంది. అంతకుముందే, ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్‌ఈ) పోర్టల్‌ను, జనగణనకు సంబంధించి పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా.. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది.

**రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా రూపొందించిన ప్రశ్నలలో కొన్ని..**

జన్మస్థలం, ప్రస్తుత నివాస స్థలం, వలసకు కారణం
ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో ఎంత కాలం నుంచి ఉంటున్నారు? ఎందుకు ఉంటున్నారు?
వ్యక్తి వైవాహిక స్థితి.. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ, మాతృభాష, మాట్లాడగలిగే ఇతర భాషల వివరాలు
అక్షరాస్యతతో పాటు... డిజిటల్ అక్షరాస్యత స్థితి
ఆర్థిక కార్యకలాపాల వివరాలు
ఉద్యోగం కోసం వెతుకుతుంటే... ఎలాంటి పనికోసం వెతుకుతున్నారనే విషయంపై స్పష్టత
వివాహిత, వితంతువు, విడాకులు తీసుకున్న మహిళలకు సంబంధించి... పిల్లలతో సహా అన్ని వివరాల నమోదు
కొవిడ్19 వ్యాక్సినేషన్ చేయించుకున్న ప్రదేశం
బ్యాంకు ఖాతాలు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలతో కలిపి... మొత్తం 40 అంశాలపై వివరాల సేకరణ

# 1057 మందికి గ్యాలంట్రీ/సేవా పతకాలు.. ఏపీ, తెలంగాణ పోలీసులకు ఇలా..




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్, పౌర రక్షక వంటి విభాగాల్లో సేవలందిస్తోన్న సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం గ్యాలంట్రీ/సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1057 మందిని ఈ పతకాలకు హోంశాఖ (MHA) ఎంపిక చేసింది. వీరిలో 92 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు ఇవ్వనుంది. 301 మందికి పోలీసు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) అందించనుంది.

గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 301 మందిలో అత్యధికంగా 197 మంది తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులున్నారు. జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తోన్న 51 మంది, ఈశాన్య రాష్ట్రాల్లో విధులు నిర్వర్తిస్తోన్న 12 మంది పోలీసులకు ఈ పతకాలు దక్కాయి. ప్రాణాలను, ఆస్తులను కాపాడటం, నేరాలను నిరోధించడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికి కేంద్ర హోంశాఖ ఏటా ఈ అవార్డులను అందజేస్తోంది.

**తెలుగు రాష్ట్రాల పోలీసులకు ఇలా..**

తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పోలీసులకు ఈ పతకాలు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 21 మంది వీటికి ఎంపికయ్యారు. ఇందులో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు లభించనున్నాయి. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి, అదారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబుకు గ్యాలంట్రీ మెడల్స్ దక్కాయి.

తెలంగాణ నుంచి 15 మంది జాబితాలో ఉన్నారు. వీరిలో ముగ్గురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 10 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. తెలంగాణ అదనపు డిప్యూటీ కమిషనర్ జోగుల నర్సయ్య, ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు అందుకోనున్నారు. జూనియర్ కమాండోలు బి. సత్యరావు, కె. సందీప్ కుమార్, జె. వంశీకృష్ణ గ్యాలంట్రీ మెడల్స్‌కు ఎంపికయ్యారు.

**21 మంది సీబీఐ అధికారులకు..**

ఇక, కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తోన్న 21 మంది అధికారులకు కూడా
ఈ పతకాలు దక్కాయి. వీరిలో ఆరుగురు అధికారులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 15 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. వీరిలో విశాఖపట్నం డీఎస్పీ (సీబీఐ)గా ఉన్న సంజయ్ కుమార్ సమాల్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం దక్కింది.

# 'కరూర్' బాధితులకు ఉద్యోగాలు.. విజయ్‌కు సుప్రీంలో ఊరట



కరూర్ తొక్కిసలాట ఘటన బాధితులకు ఉద్యోగాల వ్యవహారానికి సంబంధించి విజయ్‌ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నియామకాలు చెల్లవంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పిటిషన్‌దారులకు నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా సుప్రీంధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటి పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇవ్వొద్దా? అని వ్యాజ్యదారులను ప్రశ్నించింది.

''తొక్కిసలాట జరిగింది.. ప్రజలు చనిపోయారు. ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాంటప్పుడు వారికి ఉద్యోగం ఇవ్వడాన్ని ప్రశ్నించడం సమంజసమేనా? ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేందుకు మీరెవరు? ఒకవేళ సంపాదించే ఇంటిపెద్ద ప్రమాదవశాత్తూ మరణిస్తే.. ఆ వ్యక్తి కుమార్తె లేదా కుమారుడికి ప్రభుత్వాలు ఉపాధి ఇవ్వకూడదా?'' అని సుప్రీం ధర్మాసనం పిటిషన్‌దారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు విజయ్ సర్కారు ఉద్యోగాలు కల్పించడంపై మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జులైలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఆ నియామకాలు చెల్లవని తీర్పునిచ్చింది. ''ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు'' అని నాడు హైకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించగా.. విజయ్ సర్కారుకు తాజాగా ఊరట లభించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. విజయ్ ఎన్నికల ప్రచారం నిమిత్తం టీవీకే పార్టీ ఏర్పాటు చేసిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్.. అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే.. జులై 10వ తేదీన కరూర్‌లో పర్యటించి.. అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.


## స్వాతంత్ర్య దినోత్సవం ముందురోజు.. దిల్లీలో పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు దేశరాజధాని దిల్లీ లో బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. దిల్లీ హైకోర్టు, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా ఇతర ప్రాంతాలకు శుక్రవారం బెదిరింపు మెయిల్ వచ్చింది. ఖలిస్థాన్ పేరిట దీనిని పంపినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

దిల్లీ హైకోర్టులో శనివారం మధ్యాహ్నం 2.11 గంటలకు బాంబు పేలుతుందని, ఆ తర్వాత దిగువ కోర్టుల్లో పేలుళ్లు జరుగుతాయని ఆ మెయిల్‌లో దుండగులు హెచ్చరించారు. ఖలిస్థానీ వేర్పాటువాద సభ్యులు ఇప్పటికే రాజధాని నగరానికి చేరుకున్నారని పేర్కొన్నారు. జామ్‌నగర్ హౌస్, ఝండేవాలన్ బిల్డింగ్, సాకేత్ ఆఫీస్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆఫీస్, విమానాశ్రయం టర్మినల్ 3, దిల్లీ మెట్రో, అంబాలాకు వెళ్లే రైళ్లు.. ఇలా పలు ప్రదేశాలను దుండగులు మెయిల్‌లో ప్రస్తావించారు. స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో దిల్లీలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమల్లో ఉన్నాయి. ఈ బెదిరింపు మెయిల్ నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తయ్యారు. అందులో చెప్పిన ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతానికి అనుమానాస్పదంగా ఏమీ గుర్తించలేదని అధికారిక వర్గాల సమాచారం.



# తప్పు చేశా.. ఎవరూ ఆ రూట్‌లో అమెరికాకు వెళ్లొద్దు!




భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన 'డంకీ' మార్గాల్లో అమెరికా సహా ఇతర విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో డంకీరూట్‌లో మెక్సికోకు వెళ్లిన ఓ పంజాబ్ యువకుడి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఏజెంట్ల మాటలు నమ్మి తాను మోసపోయానని.. ఎవరూ డంకీ మార్గంలో విదేశాలకు వెళ్లొద్దని అతడు చేతులు జోడించి వేడుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. సురక్షితంగా తీసుకువెళ్తామని నమ్మించి.. డంకీ మార్గంలో మెక్సికో కు తీసుకువెళ్లిన
ఏజెంట్లు తనను బంధించారని ఆరోపించారు. వారి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించగా.. తనపై తీవ్రంగా దాడి చేశారన్నారు. మరో వ్యక్తి సాయంతో తాను తప్పించుకోగలిగానని.. తీవ్ర గాయాల కారణంగా నడవలేని స్థితిలో ఉన్నానని పేర్కొన్నారు. అలాంటి ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని భారతీయులకు సూచించారు. గురువారం పోస్ట్ చేసిన ఈ వీడియోలో అతడి పేరు, చిరునామా వంటి విషయాలను వెల్లడించలేదు.

**ఏమిటీ డంకీ రూట్?**

**విదేశాలకు అక్రమంగా వెళ్లేందుకు అనుసరించే మార్గాన్నే 'డంకీ' రూట్‌గా వ్యవహరిస్తుంటారు. ఇది పంజాబీ వాడుక భాష నుంచి వచ్చింది. అంటే ఎటువంటి ప్రణాళిక లేకుండా ఒకచోట నుంచి మరోచోటకు వెళ్లడం. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, షిప్ కంటైనర్లు, వాహనాల్లో రహస్య కంపార్టుమెంట్లలో దేశ సరిహద్దులు దాటిస్తారు. ఇందుకోసం భారీ మొత్తంలో ఏజెంట్లు డబ్బులు వసూలు చేస్తారు. ప్రమాదకర పరిస్థితుల్లో అంతర్జాతీయ సరిహద్దులు దాటించుకుంటూ చట్టవిరుద్ధంగా ఓ దేశంలోకి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తారు. యూరోపియన్ యూనియన్ ఇచ్చే షెంజెన్ టూరిస్టు వీసాతో ఈ పద్ధతి మొదలవుతుంది. దీనివల్ల 26 దేశాల్లో తిరిగేందుకు వీలుంటుంది. నకిలీ దస్త్రాలు లేదా వాహనాల్లో రహస్యంగా యూకే లేదా అమెరికా దేశాలకు వెళ్లేందుకు అక్కడి కన్సల్టెంట్ల సాయం తీసుకుంటారు. కొందరు భారతీయులు మాత్రం కెనడా, అమెరికా, యూకేలకు అక్రమంగా వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.**

## దెయ్యాల భయంతో.. హాస్టల్ నుంచి వెళ్లిపోయిన 608మంది విద్యార్థులు



హాస్టల్‌లో దెయ్యాలు తిరుగుతున్నాయనే భయం తో ప్రభుత్వ బోర్డింగ్ హాస్టల్ నుంచి 608 మంది విద్యార్థులు వెళ్లిపోయారు. ఈ ఘటన మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో చోటుచేసుకుంది. డోమా ప్రభుత్వ బోర్డింగ్ హాస్టల్‌లో అర్ధరాత్రి సమయంలో విచిత్రమైన, భయానక శబ్దాలు వినిపిస్తున్నాయని కొంతమంది బాలికలు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌లో దెయ్యాలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయనే వార్తలు వ్యాపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వందలాది మంది విద్యార్థులు హాస్టల్‌ను విడిచి ఇళ్లకు వెళ్లిపోయారు.

అయితే, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని హాస్టల్ యాజమాన్యం తెలిపింది. ఫిర్యాదు చేసిన బాలికలను మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించినట్లు పేర్కొంది. సదరు విద్యార్థినులు తీవ్రమైన హిస్టీరియా వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని వైద్యులు తెలిపినట్లు యాజమాన్యం వెల్లడించింది. వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపింది. దీనిపై వదంతులను వ్యాప్తి చేయవద్దని కోరింది. విద్యార్థుల్లో నెలకొన్న భయాలను తగ్గించి, వారి చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

# ఇండిగో విమానం రద్దు

**- లగేజీ బెల్ట్‌పైకి ఎక్కి మహిళ నిరసన**

అత్యవసరంగా వెళ్లాల్సిన సమయంలో ఇండిగో విమానం రద్దవడంతో ఓ మహిళ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. లగేజీ బెల్ట్ పైకి ఎక్కి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. భువనేశ్వర్ విమానాశ్రయంలో చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో వైరల్‌గా మారింది. అసలేమయ్యిందంటే..?

షెడ్యూల్ ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 2:35 గంటలకు ఇండిగో విమానం భువనేశ్వర్ నుంచి దిల్లీ బయల్దేరాల్సి ఉంది. ప్రయాణికులు గంటల పాటు విమానాశ్రయంలో ఎదురు చూసినప్పటికీ ఎయిర్‌లైన్స్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. సాయంత్రం 5:30 సమయంలో విమానం రద్దయినట్లు ప్రకటించారు. అనంతరం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో ఓ ప్రయాణికురాలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. లగేజీ బెల్టుపైకి ఎక్కి విమానాశ్రయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వారి ఫైళ్లు విసిరికొట్టారు. అనారోగ్యంతో ఉన్న తన బిడ్డ దగ్గరకు వెళ్తున్నానని.. తనకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పట్టుబట్టారు. చివరకు సిబ్బంది జోక్యం చేసుకుని నచ్చచెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

## ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిన దేశ విభజన: ప్రధాని మోదీ



: దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది.

''ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయి'' అని మోదీ పేర్కొన్నారు.

## అది నాకు, విద్యార్థులకు మధ్య సమస్య.. మీ జోక్యం ఎందుకు?: సీజేఐ

నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ t)ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. ''రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు'' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. ''ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వాళ్లెవరు..?'' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.





# రుతుపవనాలపై ఎన్నో ప్రభావాలు!

నైరుతి రుతుపవనాలు భారతదేశానికి ఆయువు పట్టు. రుతుపవనాల్లో అస్థిరత ఏర్పడితే భారత్‌తోపాటు యావత్ దక్షిణాసియాలో ప్రజలకు మంచినీటి లభ్యత, వ్యవసాయం, ప్రజల జీవనోపాధులు దెబ్బతింటాయి. నైరుతి రుతుపవన వర్షపాతాన్ని అనేక వాతావరణ, సముద్ర పరిణామాలు ప్రభావితం చేస్తాయి. వీటిలో అల్పపీడనాలు, ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్, హిందూ మహాసముద్ర డైపోల్, పసిఫిక్ డెకేడల్ ఆసిలేషన్ (పీడీవో), అట్లాంటిక్ మల్టీడెకేడల్ ఆసిలేషన్ (ఏఎంవో) ఉంటాయి. ఇవన్నీ కలసికట్టుగా పనిచేస్తాయి.

వాతావరణంలో అల్పపీడనం ఏర్పడిన ప్రాంతంలో చుట్టుపక్కల ప్రాంతాలకంటే పీడనం తక్కువగా ఉంటుంది. వేసవిలో భారతీయ భూభాగం తన చుట్టుపక్కల సముద్రాలకంటే చాలా వేగంగా వేడెక్కుతుంది, ఫలితంగా అల్పపీడన ప్రాంతం లేదా తుపాను ఏర్పడుతుంది. ఖండాలపై పెద్దయెత్తున ఏర్పడే అల్పపీడన ప్రాంతాలు రుతుపవన ప్రవాహాలను నడిపించడంలో సహాయపడతాయి. పెద్ద భూభాగాలపై ఏర్పడే అల్పపీడనాల వల్ల రుతుపవన ప్రవాహాలు ఏర్పడతాయి. దీనివల్ల భూమి వైపు స్థిరమైన గాలులు వీస్తాయి. మహాసముద్రాల పైనుంచి తేమతో కూడిన గాలి భూమిపైకి వస్తుంది. రుతుపవన కాలంలో భారత భూభాగంపైనున్న వాతావరణ పొరల్లో దిగువ నుంచి మధ్య ట్రోపోస్ఫియర్ వరకు తేమ బాగా పెరుగుతుంది. ఈ తేమ మన ప్రాంతంలో అధిక వర్షపాతానికి తోడ్పడుతుంది. రుతుపవన కాలంలో అల్పపీడనాలకు బలం చేకూరుతుంది. అల్పపీడన వ్యవస్థల జీవితకాలం 3-5 రోజులు ఉంటుంది. ఇవి తరచుగా బంగాళాఖాతంలో, దాన్ని ఆనుకున్న భూభాగంలో ఏర్పడి భారతదేశం వైపు ప్రయాణిస్తాయి. ఇవి భారత ఉపఖండం పైకి పెద్ద మొత్తంలో తేమను మోసుకొస్తాయి. దేశంలో సుమారు 50శాతం రుతుపవన వర్షపాతానికి ఈ అల్ప పీడనాలే కారణమవుతాయి. వర్షా భావ ప్రాంతాలకు వానలు తెస్తాయి. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఎంత తరచుగా ఏర్పడతాయనేదాని మీద రుతుపవన ద్రోణి ఆధారపడి ఉంటుంది. రుతుపవన ద్రోణి అనేది వేసవిలో భూమిపై వేడి బాగా పెరిగినప్పుడు ఏర్పడే ఒక అల్పపీడన వాతావరణ మండలం. తేమతో కూడిన సముద్రపు గాలులు పొడి గాలితో ఢీకొన్నప్పుడు ఏర్పడే ఈ అల్పపీడన ద్రోణి ప్రపంచ వాతావరణానికి చోదక శక్తిగా పనిచేస్తుంది.

సముద్ర ఉష్ణోగ్రతల మూలంగా...

హిందూ మహాసముద్ర ద్విధ్రువత(ఐవోడీ)ను 'ఇండియన్ నినో' అని కూడా పిలుస్తారు. హిందూ మహాసముద్ర పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతల్లోని వ్యత్యాసాన్నే ద్విధ్రువత (డైపోల్) అంటారు. పశ్చిమ హిందూ మహాసముద్రం వెచ్చగా ఉంటే దాన్ని సానుకూల ఐవోడీ అంటారు. అది ఇండియాలో మంచి రుతుపవన వర్షపాతానికి అనుకూలంగా ఉంటుంది. ఈ సానుకూల దశలో, సుమత్రా-జావా తీరం వెంబడి సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువగా ఉంటాయి, అదే సమయంలో పశ్చిమ ఉష్ణమండల హిందూ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. ఐవోడీ పాజిటివ్ దశ అత్యంత సానుకూలంగా ఉంటే, తూర్పు శీతలీకరణ బలపడుతుంది. ఇది భూమధ్యరేఖ వెంబడి తూర్పు నుంచి మధ్య హిందూ మహాసముద్రం వరకు అసాధారణ పొడి పరిస్థితులను సృష్టిస్తుంది. ఎన్సో (ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్) అనేది పసిఫిక్ మహాసముద్ర ఉష్ణమండల ప్రాంతంలో సహజంగా పునరావృతమయ్యే వాతావరణ చక్రం. ఇది ప్రపంచ వాతావరణాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఎన్సోలో వెచ్చని(ఎల్ నినో), చల్లని(లా నినా), తటస్థ దశలుంటాయి. ఎన్సో చక్రం రెండు నుంచి ఏడేళ్లకోసారి పునరావృతమవుతుంది. ఎల్ నినో ఇండియా, ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియాలకు వెచ్చని పొడి వాతావరణాన్ని తీసుకొస్తుంది. లా నినా భారత్‌లో వర్షపాతాన్ని పెంచుతుంది.


ఎల్ నినో, లా నినాలలో ఏదీ తటస్థ దశలో క్రియాశీలంగా ఉండదు; వాతావరణ పరిస్థితులు, వాయు ప్రవాహాలు సాధారణ స్థితిలో ఉంటాయి. ఎన్సో, రుతుపవన వర్షపాతాల మధ్య సంబంధం ఉత్తర, మధ్య, దక్షిణ భారత ప్రాంతాల్లో భిన్న రకాలుగా వ్యక్తమవుతుంది. తూర్పు పసిఫిక్ మహాసముద్రంపై సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే ఉత్తర భారతదేశంలో వర్షపాతం మొత్తంగా తగ్గడానికి, దక్షిణ భారతదేశంలో పెరగడానికి దోహదపడుతుంది. ఎల్ నినో సమయంలో మేఘాల నిర్మాణం తగ్గడం వల్ల భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం తగ్గుతుంది. ఫలితంగా కరవు పరిస్థితులు ఏర్పడి, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుతుంది. రిజర్వాయర్లలో నీటిమట్టాలు తగ్గి సాగు, తాగునీటి కొరత ఏర్పడుతుంది. ఎల్ నినో సాధారణంగా భారతీయ రుతుపవనాలను బలహీనపరచవచ్చు కానీ, అలా ఎల్లవేళలా జరుగుతుందని చెప్పలేం. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణంలో 20-80 సంవత్సరాల వ్యవధిలో వచ్చే హెచ్చుతగ్గులను సూచించే డోలనాన్ని అట్లాంటిక్ మల్టీడెకేడల్ ఆసిలేషన్ (ఏఎంవో) అంటారు. అది భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో రుతుపవన వర్షా లను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఉత్తర-అట్లాంటిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతకూ భారతదేశంలో దుర్భిక్షానికీ సంబంధం ఉందని గతానుభవం చెబుతోంది. పసిఫిక్ బహుళ దశాబ్ద డోలనం (పీడీవో) సానుకూలంగా ఉంటే లా నినా ఏర్పడుతుంది. దీనివల్ల భారత ద్వీపకల్పంలో, పశ్చిమ-మధ్య ప్రాంతాల్లో కొండ ప్రాంతాల్లో 21-150 శాతం వరకు అధిక వర్షపాతం సంభవిస్తుంది.

ఈ ఏడాది ఎల్ నినో వేగంగా తీవ్రత సంతరించుకోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈసారి నైరుతి రుతుపవనాల కాలంలో హిందూ మహాసముద్ర డైపోల్ తటస్థంగా ఉంటుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. అంటే బలం పెరుగుతున్న ఎల్ నినోను ఎదుర్కోవడానికి బలీయమైన పరిహార యంత్రాంగం ఏదీ లేదు.

# స్వాతంత్ర్య భారతదేశ మార్గదర్శకులు

**భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ మహోత్సవాల వేళ ప్రతి భారతీయునికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. భారతదేశ స్వాతంత్ర్య సిద్ధి కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులందరికీ నివాళులు అర్పిస్తున్నాను. గత వారం అండమాన్ నికోబార్ దీవుల పర్యటన సందర్భంగా, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మన జాతీయ పతాకాన్ని ఎగురవేసే గౌరవాన్ని పొందాను. గొప్ప దేశభక్తుడైన శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ తొలిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఘట్టానికి నివాళులర్పించాను. 1943 డిసెంబర్ 30న భారత భూభాగంలో నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్ మొట్టమొదటిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన పవిత్ర నేలపై ఉండడం నాకు ఎంతో భావోద్వేగభరితమైన అనుభవం. పసుంపోన్ ముత్తురామలింగ తేవర్ ఆహ్వానం మేరకు 1939 సెప్టెంబర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ మధురైని సందర్శించిన విషయాన్ని కూడా ఈ సందర్భం నాకు గుర్తుచేసింది. ఆ చారిత్రక ఘట్టం ఆ ప్రాంతంలోని అనేక మంది దేశభక్తులకు స్ఫూర్తినిచ్చింది.**





– సీపీ రాధాకృష్ణన్
(భారత ఉపరాష్ట్రపతి)

జాతీయ స్మారక సెల్యులార్ జైలు సందర్శన, నాకు ఎంతో స్ఫూర్తినిచ్చిన మరో క్షణం. భరతమాత గొప్ప వీరులైన వీర్ సావర్కర్, యోగేంద్ర శుక్లా, బటుకేశ్వర్ దత్, సచింద్రనాథ్ సన్యాల్, ఇంకా ఎందరో వలసవాద శక్తులచే ఖైదై ఇక్కడ ఒంటరి నిర్బంధానికి గురయ్యారు. భారతదేశం స్వేచ్ఛగా, గౌరవంతో జీవించాలనే ఆశయంతో ప్రాణాలర్పించిన వారి ధైర్యం, దుఃఖము, గొప్ప త్యాగాల గాథలు నేటికీ ఆ జాతీయ స్మారక చిహ్నం యొక్క గోడలపై ప్రతిధ్వనిస్తున్నాయి. లక్షలాది ప్రజలలో దేశభక్తిని రగిలించి, దేశాన్ని స్వాతంత్ర్యం దిశగా నడిపించిన ఆ మార్గదర్శకులందరికీ నివాళిగా ఈ వ్యాసం రాసేందుకు ఆ సందర్శన నన్ను ప్రేరేపించింది.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని పురస్కరించుకుని, ఆగస్టు 9న అండమాన్ దీవులలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. 1942లో, జాతిపిత మహాత్మా గాంధీజీ 'క్విట్ ఇండియా ఉద్యమాన్ని' ప్రారంభించి, 'దేశం కోసం చేయండి లేదా చావండి' అనే ప్రేరణాత్మక నినాదంతో పిలుపునిచ్చారు. ఫలితంగా, గొప్ప స్వాతంత్ర్య కాంక్ష దేశవ్యాప్తంగా వ్యాపించింది.

వలసవాద శక్తులకు వ్యతిరేకంగా నిలిచిన ఆ తరానికి ధన్యవాదాలు. ఈనాడు మనం స్వేచ్ఛా వాయువును పీలుస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలోని రాజ్యాంగ హక్కులతో జీవించే అదృష్టాన్ని అందుకున్నాము.

మన మాతృభూమిని స్వేచ్ఛగా చూసేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు అచంచలమైన అంకితభావం, త్యాగాలతో పోరాడారు. అనేక మంది వారి అమూల్యమైన ప్రాణాలను సైతం అర్పించారు.

స్వాతంత్ర్య సమరయోధుల గాథ

ఉత్తరాన కాశ్మీర్ నుంచి, దక్షిణాన తమిళనాడు నుంచి, పశ్చిమాన గుజరాత్ నుంచి, తూర్పున అస్సాం నుంచి, ఇలా అన్ని ప్రాంతాలు, నేపథ్యాలు, వయసు, లింగ భేదాలకు అతీతంగా స్వాతంత్ర్య సమరయోధులు ఒకే ఉమ్మడి లక్ష్యమైన మాతృభూమి స్వేచ్ఛ కోసం ఏకమయ్యారు.

తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రతిఘటనకు చిరస్మరణీయంగా నిలిచిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి శౌర్యం; మంగళ్ పాండే ధైర్యం; "స్వరాజ్యం నా జన్మహక్కు, నేను దానిని సాధిస్తాను" అనే నినాదంతో జాతిని మేల్కొల్పిన బాల గంగాధర్ తిలక్ నిర్భయ పిలుపు స్వాతంత్ర్య యాత్రకు బలాన్నిచ్చింది. వి.ఓ. చిదంబరం పిళ్ళై భారతదేశ మొట్టమొదటి స్వదేశీ నౌకా రవాణా సంస్థను ప్రారంభించి, వలసవాద ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేసి, స్వాతంత్ర్య పోరాటం కేవలం యుద్ధభూమిలోనే కాదు, వాణిజ్యంలో కూడా జరిగిందని ఆయన నిరూపించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల విప్లవ స్ఫూర్తి స్వేచ్ఛా సాధన కోసం త్యాగాన్ని స్వీకరించేలా తరతరాలను ప్రేరేపిస్తోంది. ఈశాన్యంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన జ్వాలలను రాణి గైదిన్లియు అకుంఠిత స్ఫూర్తి రగిలించింది. క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ, అచంచలమైన ధైర్యంతో జాతీయ పతాకాన్ని మోస్తూ అస్సాంలో కనకలతా బారువా ప్రాణాలను అర్పించారు. భగవాన్ బిర్సా ముండా తో పాటుగా అనేక మంది గిరిజన నాయకులు వలసవాద పాలనకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక ప్రతిఘటనకు నాయకత్వం వహించారు. చరిత్ర పుటల నుంచి వెలికితీయగల స్థైర్యం, ధైర్యం, సంకల్పానికి సంబంధించిన కథలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ ధైర్యం, త్యాగాల వైభవాన్ని చాటుతూ, తరతరాలకు స్ఫూర్తినిచ్చే అసంఖ్యాకమైన వీరుల సమిష్టి సంకల్పంతోనే భారతదేశ స్వాతంత్ర్యం సాధ్యమైందని మనకు గుర్తుచేస్తాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో తిరుప్పూర్

ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్న సందర్భంగా, 'కోడి కథ కుమారన్' (పతాక సంరక్షకులు)గా ప్రసిద్ధి చెందిన తిరుప్పూర్ కుమారన్‌కు నివాళులర్పిస్తున్నాను. స్వాతంత్ర్య పోరాట సమయంలో, మరణం సంభవించిన జాతీయ పతాకాన్ని కింద పడనీయకుండా, నా స్వస్థలమైన తిరుప్పూర్‌లో ప్రాణ త్యాగం చేయడంతో ఆయనకు ఈ బిరుదు లభించింది.

చిన్న వయసులోనే కుమారన్ హృదయంలో దేశభక్తి జ్వాలు వెలిగాయి. "స్వరాజ్యం మన జన్మహక్కు" అనే పిలుపుతో ప్రేరణ పొంది, స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. మహాత్మా గాంధీ ఆదర్శాలచే అమితంగా ప్రభావితమైన కుమారన్, ప్రజలలో, ముఖ్యంగా యువతలో జాతీయవాద స్ఫూర్తిని మేల్కొల్పడానికి "దేశబంధు యూత్ అసోసియేషన్"ను స్థాపించారు. వలసవాద పాలనలోని అన్యాయాల పట్ల ప్రజలు చైతన్యవంతులై, వాటిని ప్రతిఘటించే ధైర్యాన్ని, స్పష్టతను పెంపొందించుకున్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధ్యమవుతుందని కుమారన్ గట్టిగా విశ్వసించారు. గాంధీజీ సాంఘిక సంస్కరణ సూత్రాలకు కట్టుబడి ఆయన, మద్యపాన నిషేధాన్ని సామాజిక, జాతీయ పునరుజ్జీవనానికి ఒక ఆవశ్యకమైన అడుగుగా భావిస్తూ, అందుకొరకు క్రియాశీలకంగా పోరాడారు. ఇందులో భాగంగా, మహోన్నతమైన భారతదేశ స్వాతంత్ర్య ఆశయం కోసం ప్రజలను మద్యపానాన్ని విడిచిపెట్టి, స్వీయ నియంత్రణను అలవర్చుకోవాలని ప్రోత్సహిస్తూ, కల్లు దుకాణాల వద్ద జరిగే నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

1932 జనవరి 10న జరిగిన శాసనోల్లంఘన ఉద్యమ సమయంలో కుమారన్ చేతుల్లో జాతీయవాద పతాకాన్ని పట్టుకుని, మరికొందరు ధైర్యవంతులతో కలిసి, తిరుప్పూర్ వీధుల్లో 'వందేమాతరం' నినాదాలు ప్రతిధ్వనించేలా ఒక యాత్రకు నాయకత్వం వహించారు. వలసవాద పాలన దళాలు ఆ బృందంపై దాడి చేశాయి. కుమారన్ తలకు గాయాలైన, పెదాలపై 'వందేమాతరం' నినాదాలతో, శరీరానికి పతాకాన్ని హత్తుకుని దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఆయన మరణించే నాటికి ఆయన వయస్సు కేవలం 27 ఏళ్లు మాత్రమే.

తిరుప్పూర్ కుమారన్ గురించి నేను రాస్తున్నప్పుడు, మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో యువకులు నాకు గుర్తుకు వస్తున్నారు. వారిలో కొందరు: భగత్ సింగ్ (23), సుఖ్‌దేవ్ (23), రాజ్‌గురు (22), ఖుదీరామ్ బోస్ (18), కనకలతా బారువా (18), అనంత లక్ష్మణ్ కన్హేరే (19), వంచినాథన్ (25) వంటి ఎందరో యువకులు వారి ప్రాణాలను త్యాగం చేసి, భారత స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో అమరులయ్యారు.

మన జాతీయ ఉద్యమంలో గుర్తింపు పొందని వీరులను వెలుగులోకి తీసుకువచ్చిన మన గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి చొరవను ప్రశంసిస్తున్నాను. ప్రసిద్ధి చెందిన, చెందని స్వాతంత్ర్య సమరయోధులందరికీ నివాళులు అర్పిస్తున్నాను.

ఈ మహత్తర వేళ, మన మాతృభూమి పట్ల మన నిబద్ధతను పునరాలోచించి, పునరుద్ధరించుకుందాం. ఈ అమృత యుగంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించేందుకు మనల్ని మనం అంకితం చేసుకుని, దేశ పురోగతి, సుసంపన్నత కోసం కలిసికట్టుగా కృషి చేద్దాం. అచంచలమైన ధైర్యంతో పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం వారి ప్రాణాలను త్యాగం చేసిన వీరయోధులకు మనం అర్పించగల అత్యంత సముచితమైన నివాళి ఇదే అవుతుంది.

**జై హింద్! భరతమాత వర్ధిల్లాలి!**

# ఆరోగ్య సంరక్షణకు అరుదైన అవకాశం

**దేశంలో ఏటా లక్షలమంది మహిళలు అనేక అనారోగ్య సమస్యలతో గర్భధారణలోకి ప్రవేశిస్తున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, రక్తహీనత, పోషకాహార లోపాలతోపాటు బయటపడని గుండెజబ్బులు కూడా ఉండవచ్చు. చాలామందిలో ఇవి ముందెప్పుడూ గుర్తించి ఉండకపోవచ్చు. కనీస పరీక్షలూ జరిగి ఉండవు. చాలామంది మహిళలు బాల్యం తర్వాత వైద్యుల దగ్గరికి వెళ్లేది గర్భధారణ సమయంలోనే. అందుకని, గర్భధారణను మహిళ జీవితంలో ఆరోగ్య సంరక్షణకు, అనారోగ్య నివారణకూ కీలక ఘట్టంగా భావించాలి.ప్రసవానికి ముందు సంరక్షణ అంటే అందరికీ తెలిసింది గర్భిణిని బాగా చూసుకోవడం, శిశువు ఆరోగ్యంగా జన్మించేలా జాగ్రత్తపడటమే. ఇదంతా ముఖ్యమే. కానీ ఈ క్రమంలో మనం ప్రివెంటివ్ మెడిసిన్‌లో గొప్ప అవకాశాన్ని విస్మరిస్తున్నాం. గర్భధారణ అనేది కేవలం పునరుత్పత్తికి దారితీసేది మాత్రమే కాదు. అది సమగ్ర ఆరోగ్య పరీక్షల నిర్వహణకు ఒక అవకాశం కూడా. జీవితంలో ఏ ఇతర దశలోనూ గర్భధారణ మాదిరిగా తొమ్మిది నెలలపాటు వైద్య సంప్రదింపులు, పరీక్షలు, శారీరక పర్యవేక్షణ, నిరంతర కౌన్సెలింగ్ జరగదు. గర్భధారణ దాదాపు ప్రతి అవయవంపై ప్రభావం**



**చూపుతుంది. గర్భవతిలో రక్తపరిమాణం నాటకీయంగా పెరుగుతుంది. గుండె మరింతగా శ్రమిస్తుంది. శరీరం ఇన్సులిన్‌ను ఉపయోగించుకునే తీరులో మార్పులు వస్తాయి. మూత్రపిండాల పనితీరు, ఎండోక్రైన్ గ్రంథుల వ్యవస్థ మార్పులు చెందుతుంది. దాగిఉన్న వ్యాధులు సైతం బయటపడతాయి.**

అతిగా పరీక్షలు అక్కర్లేదు కానీ...

కుటుంబమంతా ఒక మహిళ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించే అరుదైన ఘట్టాలలో గర్భధారణ ఒకటి. కాబట్టి చాలా మంది గతంలో వాయిదా వేసుకున్న ఆరోగ్య పరీక్షలను క్రమంతప్పకుండా, ఇష్టపూర్వకంగా చేయించుకుంటారు. పోషకాహారం, వ్యాయామం, బరువు పెరగడంపై సలహాలను శ్రద్ధగా పాటిస్తారు. మందులనూ మరవకుండా వేసుకుంటారు. మామూలు రోజుల్లో రోగ నివారణ, ఆరోగ్య సంరక్షణలపై పెద్దగా శ్రద్ధపెట్టని కుటుంబాలు కూడా గట్టిగా పట్టించుకుంటాయి. ఇలాంటప్పుడు ఆహార విహారాలకు సంబంధించిన పాత అలవాట్లను వదిలించుకుంటే తక్షణ ఫలితాలు కనిపిస్తాయి. పాశ్చాత్య ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలో కుటుంబ వైద్యులు నిరంతర నివారణ, సంరక్షణ సేవలు అందిస్తారు. అలాంటిది మన దేశంలో లేదు. చాలామంది మహిళలకు దీర్ఘకాల ఆరోగ్య రికార్డులు ఉండవు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్యులతో దీర్ఘకాలిక సంప్రదింపులు లేకుండానే గర్భం ధరిస్తారు. గర్భిణి దశలో బరువు పెరగడం, ఆలస్య ప్రసవాలు, మధుమేహం, రక్తపోటు వంటివి మరింతగా సమస్యాత్మకం అవుతాయి. దీనికితోడు సరైన వైద్య రికార్డులు లేకపోవడం గర్భవతి సంరక్షణను ఇంకా జటిలం చేస్తుంది. ఇలాంటి స్థితిలో గర్భధారణ అనేది కేవలం తల్లి సంరక్షణకే పరిమితమయ్యే దశ కాదనీ, ఆమెలో దీర్ఘకాలిక వ్యాధిని ముందే గుర్తించడానికి, దీర్ఘకాల ఆరోగ్య సంరక్షణకు అంది వస్తున్న అవకాశంగా గుర్తించాలి. అలాగని విచక్షణా రహితంగా వైద్య పరీక్షలు చేయాలనీ కాదు. మంచి వైద్యమంటే అతిగా పరీక్షలు చేయడం కాదు. సంపన్న దేశాల అనుభవాల నుంచి రూపుదిద్దుకున్న సిఫార్సులను గుడ్డిగా అనుకరించడమూ కాదు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా, భారతీయ మహిళకు కావాల్సిన పరీక్షలు, వైద్యసేవలు అందించడం అవసరం. అందుకు గర్భధారణ ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. ప్రసవానికి ముందు తీసుకోవాల్సిన సంరక్షణపై మరింత స్పష్టమైన దృక్పథాన్ని అలవరచుకోవాల్సి ఉంది.

అవగాహన ముఖ్యం

చక్కగా ప్రసవమైనంత మాత్రానే వైద్య సేవలు, సంరక్షణ విజయవంతమైనట్లు కాదు. ఒక మహిళ గర్భం ధరించినప్పటితో పోలిస్తే, బిడ్డను ప్రసవించిన తర్వాత మరింత ఆరోగ్యంగా ఇంటికి వెళ్లడమే కీలకం. ఒకవేళ ఆమెకు మధుమేహం, హృద్రోగం, థైరాయిడ్ వ్యాధి ఉంటే చికిత్స చేయడం ప్రధానం. గర్భవతిగా ఉన్నప్పుడు రక్తహీనతకు చికిత్స చేశారా, అవసరమైన టీకాలన్నీ వేశారా, మానసిక సమస్యలేవైనా ఉంటే పరిష్కరించారా, భవిష్యత్తులో నివారణ, సంరక్షణల కోసం స్పష్టమైన ప్రణాళిక చేపట్టారా అన్నవీ ముఖ్యమే. అయితే ఇదంతా ఒక్క గర్భధారణ కాలానికే పరిమితం కాకూడదు. తదుపరి గర్భం ధరించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సేవలను పొందడంపై అవగాహన కల్పించాలి. దీనివల్ల మహిళలు ఎప్పటికప్పుడు వైద్యుల సాయం కోరతారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకుంటారు. దీర్ఘకాల వ్యాధుల ముప్పుల్ని ఎదుర్కోగలుగుతారు. ఇదంతా తదుపరి గర్భధారణలకూ ఉపకరిస్తుంది. దీనివల్ల కుటుంబాలు ఆరోగ్యకరంగా మారతాయి. అంతిమంగా ఆరోగ్య భారతాన్ని సాకారం చేస్తాయి. తల్లులు, నవజాత శిశువుల సంరక్షణ కోసం ఇండియా భారీ వనరులు, సేవలను కేటాయిస్తోంది. ఈ కృషిని మరింతగా విస్తరించాల్సి ఉంది. ఈ క్రమంలో గర్భధారణను కేవలం తొమ్మిది నెలలపాటు సురక్షితంగా ప్రయాణించాల్సిన దశగానే కాకుండా, మహిళ జీవితకాలంలో దీర్ఘకాల అనారోగ్య నివారణకూ అందివస్తున్న అపూర్వ అవకాశంగా పరిగణించాలి. మనం ఈ తత్వాన్ని బోధపరచుకుంటే, ప్రసవానికి ముందు సంరక్షణ కాన్పుతోనే ముగియదు అక్కడి నుంచి ఆరోగ్యవంతమైన జీవితానికి అది నాంది అవుతుంది.

# పల్లెల్లో డిజిటల్ వసతుల కరవు!

**పౌరసేవల పంపిణీలో వేగంతో పాటు పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ వసతులు ఎంతో తోడ్పడతాయి. ప్రభుత్వాలు నేరుగా ప్రజలతో అనుసంధానం కావడానికి అవి మార్గం సుగమం చేస్తాయి. కాబట్టి, ముఖ్యంగా 60శాతానికి పైగా జనాభాకు నెలవులైన గ్రామాలకు ఆధునిక సాంకేతికతను సమర్థంగా చేరువచేసినప్పడే వికసిత భారత ఆశయాల సాధనకు అవకాశాలు విస్తారమవుతాయి. ఈ వాస్తవాన్ని గుర్తించే ప్రభుత్వాలు డిజిటల్ పంచాయతీలు, ఈ-గ్రామ్‌స్వరాజ్ వంటి కార్యక్రమాలకు నడుంకట్టాయి. పంచాయతీల్లో అధికారిక రాతకోతలన్నీ కంప్యూటర్‌లోనే సాగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయి. తద్వారా ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నుల వసూళ్లు, ఆస్తుల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికలు, నిధుల పర్యవేక్షణ వంటివి చాలాచోట్ల సులభతరమవుతున్నాయి. ప్రజలకు అనవసర వ్యయప్రయాసలూ తప్పుతున్నాయి. కానీ, సర్కారీ లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 56వేలకు పైగా పంచాయతీల్లో కంప్యూటర్లు కరవయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలికవసతుల కొరతను తగ్గిస్తూ ఈ-గవర్నెన్స్‌కు ఊతమిచ్చేందుకు కేంద్రం తాజాగా 'దాన్‌వీర్' కార్యక్రమాన్ని ప్రకటించింది. దీనికింద ఉదారులు ఎవరైనా పంచాయతీలకు కంప్యూటర్లను సమకూర్చవచ్చునని పిలుపిస్తోంది. గ్రామీణాభ్యుదయాన్ని ఆశించేవారు ఇందులో భాగస్వాములైతే పల్లెల ప్రగతి కొత్త దశలోకి ప్రవేశిస్తుంది!**

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నివేదిక ప్రకారం నిరుడు మార్చి నాటికి పంజాబ్‌లో దాదాపు రెండుశాతం గ్రామ పంచాయతీల్లోనే కంప్యూటర్లు ఉన్నాయి. తెలంగాణలో ఏడున్నర వేలకు పైగా, ఏపీలో మూడువేలకు పైగా పంచాయతీల్లో అవి మృగ్యమయ్యాయి. బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణాలలోనూ చాలా పంచాయతీల్లో కంప్యూటర్లు లేవు. అవి ఉన్నచోట్లా ఇంటర్నెట్ సౌకర్యం కొరవడటంతో అలంకారప్రాయంగా మారాయి. దేశీయంగా పలు ప్రాంతాల్లో ఇలాంటి దుస్థితే రాజ్యమేలుతోంది. సమ్మిళిత అభివృద్ధి కోసం డిజిటల్ భారత్‌ను ఆవిష్కరించుకోవాలన్న సదాశయానికి అది విఘాతం కలిగిస్తోంది. వాస్తవానికి దేశవ్యాప్తంగా రెండున్నర లక్షలకు పైగా పంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ ద్వారా నాణ్యమైన ఇంటర్నెట్‌ను అందించేందుకు 'భారత్‌నెట్' పథకం తెచ్చారు. అందులో భాగంగా 2.15 లక్షల పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్ సేవలతో అనుసంధానించారు. కానీ, చాలీచాలని నెట్ వేగం, తరచూ తెగిపోతున్న కేబుళ్లను వెంటనే మరమ్మతు చేయకపోవడం, విద్యుత్ కోతలతో భారత్‌నెట్ లక్ష్యాలు నీరుగారుతున్నాయి. దాంతో దట్టమవుతున్న డిజిటల్ అసమానతలు ప్రగతి ఫలాలను అందరికీ చేరువచేయడంలో ఆటంకాలవుతున్నాయి.

**మన పల్లెల్లో ప్రతి వందమందికి సగటున 48.31 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉంటే- పట్టణ ప్రాంతాల్లో అవి 126.80గా లెక్కతేలుతున్నాయి. గ్రామీణ-నగర భారతాల మధ్య నెలకొన్న డిజిటల్ అంతరాలకు ఇది అద్దంపడుతోంది. భారత్‌నెట్ కింద 13లక్షల ఇళ్లకు స్థిర కనెక్షన్లు అందిస్తే, మొన్న మార్చి నాటికి వాటిలో ఎనిమిది లక్షలే క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. గజిబిజి టారిఫ్‌లకుతోడు సాంకేతిక లోపాలు ప్రతిబంధకాలవుతున్నాయి. పల్లెల్లో డిజిటల్ సేవలు విస్తృతమైతే పింఛన్లు, రాయితీలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరతాయి. ఆన్‌లైన్ తరగతులు, ఈ-లెర్నింగ్‌లతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగవుతాయి. పంటల రక్షణ, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు నిపుణుల సూచనలు లభిస్తాయి. డిజిటల్ మార్కెట్లకు చేరువవ్వడం ద్వారా తమ ఉత్పత్తులను అన్నదాతలు లాభసాటి ధరలకు విక్రయించుకోగలుగుతారు. ఇవన్నీ సాకారం కావాలంటే- పల్లెల్లో అంతర్జాల సదుపాయ కల్పనకు, డిజిటల్ అక్షరాస్యత పెంపునకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి!**

# చర్యలు తీసుకోవడానికి ఎవరు?

**హైదరాబాద్, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ నల్సార్ లా విద్యార్థులు నిరసన తెలపడంతో బీసీఐ వారి ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. బీసీఐ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన సీజేఐ.. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని ఆయన ఉద్ఘాటించారు. అంతేకాదు, నల్సార్ విద్యార్థులు లేదా అధ్యాపకులపై బీసీఐ కానీ, రాష్ట్ర బార్ కౌన్సిళ్లు కానీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**సీజేఐ ఫైర్**

"విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే చర్యలు తీసుకోవడానికి బీసీఐ ఎవరు? శాంతియుతంగా నిరసన తెలపడం విద్యార్థుల హక్కు. ఇది విద్యార్థులకు, నాకు మధ్య జరుగుతున్న సంభాషణ. ఇందులో వేరొకరు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. ముమ్మాటికీ బీసీఐ చర్య అర్థరహితమని అభిప్రాయపడింది. ఈ వివాదంపై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

**వివాదం ఎలా మొదలైంది?**

త్వరలో జరగనున్న స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా నల్సార్ లా యూనివర్సిటీ ఆహ్వానించింది. అయితే, విషయాన్ని పునరాలోచించాలని యూనివర్సిటీ యాజమాన్యాన్ని విద్యార్థుల్లో ఓ వర్గం కోరడంతో ఈ వివాదం మొదలైంది. జులై 20న జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడికి సంబంధించిన విచారణ సందర్భంగా సీజేఐ చేసిన వ్యాఖ్యలను విద్యార్థులు తమ లేఖల్లో ప్రస్తావించారు. జులై 23 నుంచి యాజమాన్యానికి వివిధ బ్యాచ్ విద్యార్థులు కనీసం 6 విజ్ఞాపన పత్రాలను సమర్పించారు. విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్‌కు సంబంధించిన వీడియోలు చూడాలని లాయర్ కోరగా.. "మాకు వీడియోలపై ఆసక్తి లేదు, చూడటానికి సమయం లేదు.. మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" అని సీజేఐ వ్యాఖ్యానించినట్లు విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐని ఆహ్వానించడం రాజ్యాంగ హక్కులు, న్యాయం అందించడం పట్ల యూనివర్సిటీకి ఉన్న నిబంధనలకు విరుద్ధమని వాదించారు. "స్నాతకోత్సవం అనేది రాజ్యాంగ హక్కులు, విలువలు ప్రతిబింబించే వేడుక. నిరసనకారులపై పోలీసుల దాష్టికాన్ని తేలికగా తీసుకున్న ఒక ప్రముఖ వ్యక్తి చేతుల మీదుగా డిగ్రీలు తీసుకోవడం, నల్సార్‌లో మేము నేర్చుకున్న విలువలకే విరుద్ధంగా ఉంది" అని విద్యార్థులు తమ లేఖలో స్పష్టం చేశారు.

ఈ లేఖలకు వందల మంది విద్యార్థులు మద్దతు తెలిపినట్లు సమాచారం. "సీజేఐ పదవిని మేము గౌరవిస్తాం. కానీ మాకు రాజ్యాంగ విలువలు బోధించారు. వాటికి విరుద్ధంగా ఉన్న దేనికీ మేము మద్దతు ఇవ్వలేం" అని స్టూడెంట్ బార్ కౌన్సిల్ సభ్యుడైన ఒక విద్యార్థి వ్యాఖ్యానించారు.

**ఎన్‌రోల్‌మెంట్‌పై బీసీఐ నిషేధం**

ఈ వ్యవహారం గురువారం మలుపు తిరిగింది. నల్సార్ 2026 గ్రాడ్యుయేట్లను అడ్వకేట్లుగా నమోదు చేయవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించడం వివాదం చెలరేగింది. ఈ నిరసన ఎవరు ప్రారంభించారు? ప్రోత్సహించింది ఎవరు? నివేదిక మూడు రోజుల్లో తమకు అందజేయాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను బీసీఐ కోరింది. నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని, లేఖలపై సంతకాలు చేసినవారికి, అసలు ప్రచారాన్ని నడిపినవారికి తేడా చూపిస్తూ నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

న్యాయశాస్త్రం చదివి, దేశ అత్యున్నత న్యాయవ్యవస్థపై గౌరవం లేనివారు బాధ్యతాయుతమైన లాయర్‌గా, అధ్యాపకుడిగా లేదా న్యాయమూర్తిగా పనికిరాడని, అది వృత్తికే భారమని బీసీఐ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అంతేకాకుండా, వర్సిటీలోని కొందరు అధ్యాపకులే విద్యార్థులను ఎగదోసి 'నీచ రాజకీయాలు' చేస్తున్నారని ఆరోపించింది. యితే, ఈ నిర్ణయంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్‌తో సహా పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీజేఐని విద్యార్థులు వ్యతిరేకించడాన్ని సమర్థించకపోయినా, బీసీఐ నిర్ణయం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఉందని ఆయన మండిపడ్డారు. తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో కొద్ది గంటల్లోనే తన నిర్ణయాన్ని బీసీఐ ఉపసంహరించుకుంది. ముందు లేఖపై సుదీర్ఘంగా చర్చించామని, ఆ ఉత్తర్వులను సవరిస్తున్నామని మనన్ కుమార్ మిశ్రా వెల్లడించారు.

# మా సహనం పరీక్షించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

88 గంటల పాటు సాగిన ఈ సైనిక ఆపరేషన్ వెనక ఉన్న వ్యూహాలు, నిర్ణయ ప్రక్రియపై దోవల్ ఇందులో వివరించనున్నారు. భారత్ సహనంగా ఉంటే దేశమైనప్పటికీ, ఇది బలహీన దేశం కాదని అజిత్ దోవల్ స్పష్టం చేశారు. "మా సహనాన్ని బలహీనతగా పొరబడకండి. భారత్ రిస్కులు తీసుకోగలదు. అవసరమైతే గట్టి దెబ్బకొట్టగలదు" అని ఆయన అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాద సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని దోవల్ వెల్లడించారు. భారత సైనిక, జాతీయ భద్రతా నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను కూడా ఈ డాక్యుమెంటరీ చూపించనుంది. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన దారుణమై ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న ఆపరేషణ్ సిందూర్ చేపట్టారు. పాకిస్తాన్, పీఓకేలోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్‌కు చెందిన ట్రైనింగ్ క్యాంపులు, కార్యాలయాలను ధ్వంసం చేశారు. పాక్ సైన్యం భారత్‌పై దాడి చేసేందుకు ప్రయత్నిస్తే, భారత్ తన క్షిపణులు, యుద్ధ విమానాలతో పాక్ ఎయిర్ ఫోర్స్ బేసుల్ని ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ లోని 10కి పైగా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఇందులో పాక్ ఎయిర్ ఫోర్స్, న్యూక్లియర్ కమాండ్ సెంటర్‌గా ఉన్న రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్ కూడా ఉంది. చివరకు పాక్ శరణు కోరడంతో కాల్పుల విరమణ జరిగింది. అణ్వాయుధ దేశాలైన భారత్, పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణ దాదాపు 88 గంటల పాటు కొనసాగింది.

# భారతీయులపై దాడులు

(మొదటి పేజీ తరువాయి)

202125 మధ్య మొత్తం 302 దాడులు నమోదయ్యాయి. 2021లో 15, 2022లో 31, 2023లో 67, 2024లో 85, 2025లో 104 దాడులు జరిగాయి. అమెరికాలో గత ఐదేళ్లలో అత్యధికంగా 33 దాడులు జరిగాయి. ఆ తర్వాత యూఏఈలో 32, యూకేలో 31, కెనడాలో 30, ఐర్లాండ్‌లో 24, రష్యాలో 23, జర్మనీలో 19 ఘటనలు నమోదయ్యాయి.

విదేశాల్లో భారతీయులపై జరుగుతున్న దాడులపై అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్పందించారు. విదేశాల్లో భారతీయుల భద్రత, రక్షణ భారత "అత్యంత ప్రాధాన్యత" అని చెప్పారు. ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ఆ దేశ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమగ్ర విచారణ జరిగేలా, నిందితులకు ఆ దేశ చట్టాల ప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# దేశభక్తిని చాటి చెప్పేలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**అమడగూరు ఆగస్టు 14 ( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు మండల కేంద్రంలోని, స్థానిక జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ నుండి బస్టాండ్ వరకు, ర్యాలీ నిర్వహించారు, ఎంపీడీవో శకుంతల, ఎంఈఓ జిలాన్ భాష, మాట్లాడుతూ,సమాజంలో ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని దేశభక్తిని చాటి చెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు అంతేకాకుండా, ప్రతి ఒక్కరు ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగరవేద్దామని ఎంపీటీవో శకుంతల,ఎంఈఓ జిలాన్,భాష తెలియజేశారు, అధికారులు ఉపాధ్యాయుల,,ఆధ్వర్యంలో శుక్రవారం, విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ బస్టాండ్ వరకు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో మానహారంగా ఏర్పడి హర్ ఘర్ తిరంగా ఉద్దేశం గురించి వివరించారు. 80,వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలో సందర్భంగా ఆగస్టు 2 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి భారత స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడానికి, స్వాతంత్రం కోసం పోరాడిన ఆ మహానుభావుల స్మరించుకోవడం కోసం వారి త్యాగాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు సమాజంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీవో శకుంతల, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, యు ఆర్ డి రాజశేఖర్,ఎంఈఓ జిలాన్ భాష, మమత కార్యదర్శి మమత స్కూల్ హెచ్ఎం ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి, ఐకెపి ఎపిఎం భారతి, డిజిటల్ అసిస్టెంట్, అశోక్, సోమశేఖర్, ఎం ఆర్ సి నుండి నాగరాజు, మునికిష్ట, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వెంగన్నపల్లి గ్రామాన్ని తనిఖీ చేసిన సిఐ



**యాడికి, ఆగష్టు 14,, అనంత జనశక్తి న్యూస్ :**

మండల పరిధిలోని వేములపాడు గ్రామాన్ని శుక్రవారం సిఐ శ్రీనివాసులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు ప్రజలతో మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, ఫ్యాక్షన్ ను వీడి ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. ఫ్యాక్షన్ తో కుటుంబాలు నాశనం అవుతాయని, పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వ్యక్తి ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



**యల్లనూరు, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్ ;**

మండలంలోని చిలంకూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్ (22) అనే యువకుడు పుట్లురు మండలం శనిగల గూడూరు సమీపంలో ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ సంఘటనను గుర్తించిన కొందరు 108వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# ‘కడప స్మార్ట్ కిచెన్’కు నీతిఆయోగ్ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం ప్రత్యేకంగా 95 డెలివరీ వాహనాలు అందుబాటులో ఉంచారని.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా స్మార్ట్ కిచెన్ల ద్వారా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది.

సెంట్రలైజ్డ్ మెకనైజ్డ్ కుకింగ్‌తో పాటుగా ఆహారాల నాణ్యతలో స్టాండర్డ్ ప్రోటోకాల్స్, వాహనాలకు జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు, డ్యాష్ బోర్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉందని.. ఆహారం రుచి, నాణ్యతపై క్యూఆర్ కోడ్ ఆధారంగా అభిప్రాయాలు కూడా తెలుసుకుంటున్నారని నీతిఆయోగ్ పేర్కొంది. స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా భోజన పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం, ట్రేసింగ్ వీలవుతుందని ప్రశంసించింది. ఈ నేపథ్యంలో కడప స్మార్ట్ కిచెన్లను గుర్తించినందుకు నీతిఆయోగ్‌కు మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు తెలియజేశారు. స్మార్ట్ కిచెన్ నమూనాలో స్వయం సహాయక బృందాల మహిళలు భాగస్వామ్యులుగా ఉండటం సంతోషం కలిగిస్తోందన్న నారా లోకేష్.. పిల్లలకు సంరక్షణ, పోషకాహారాన్ని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత బలోపేతం చేస్తామని ట్వీట్ చేశారు.

ఏంటీ స్మార్ట్ కిచెన్లు..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తోంది. స్మార్ట్ కిచెన్‌లలో పనిచేసే వారికి ఫైవ్ స్టార్ హోటల్ తరహాలో డ్రెస్ కోడ్ ఉంటుంది. పరిశుభ్రతా చర్యలు కూడా అదే తరహాలో ఉంటాయి.ఈ స్మార్ట్ కిచెన్లలో కూరగాయలను కోయడం మొదలుకుని, వంట వరకూ అంతా ఆటోమేటెడ్ మెషీన్ల సాయంతో చేపడతారు. అలాగే వండిన ఆహారాన్ని జిల్లాలో వేర్వేరు ప్రాంతాలలో ఉన్న స్కూళ్లకు చేరవేసేందుకు ఎలక్ట్రికల్ వాహనాలను సమకూర్చారు.

ఆహారం వండిన తర్వాత వంట గదిలో ఏర్పడే సేంద్రీయ వ్యర్థాలను మిథేన్ గ్యాస్‌గా మార్చుకుని స్మార్ట్ కిచెన్ అవసరాలకు తిరిగి ఉపయోగిస్తున్నారు. ఆహార వ్యర్థాన్ని నివారించేందుకు ఆరోజు పాఠశాలలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే సమచారాన్ని రియల్ టైమ్ డేటా ద్వారా తెలుసుకుని అందుకు అనుగుణంగా ఆహారాన్ని తయారు చేస్తారు. ఇక స్మార్ట్ కిచెన్లలో ఉండే ఓవెన్లు, కుక్కర్లు, ఫ్రిడ్జిల నుచి ఆహారాన్ని స్కూళ్లకు చేరవేసే వాహనాల ట్రాకింగ్ వరకూ అన్నీ కూడా స్మార్ట్ ఫోన్ ద్వారా నియంత్రిస్తున్నారు. వాహనాలను ట్రాక్ చేసేందుకు వీలుగా జీపీఎస్ ట్రాకర్లు కూడా ఏర్పాటు చేశారు.

# శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి శ్రావణ పూజలు

**యాడికి, ఆగష్టు 14, అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రావణ మాస పూజలు నిర్వహించారు.ఉదయం కన్యకాపరమేశ్వరి దేవి మాత కు పంచామృత అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు.జీఎస్టీ రవితేజ ద్వారా వచ్చిన రూ. 25వేల నూతన కరెన్సీ తో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించారు.అర్చనలు చేసి, ప్రత్యేక హారతులు సమర్పించారు. సాయంత్రం ఏడు గంటలకు కుంకుమార్చన, మణిద్వీప వర్ణన, రథోత్సవం, కోలాటా కార్యక్రమం ను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం యాడికి ఆర్య వైశ్య సంఘం బంగారు బాల , లయన్ పవన్,రాజేష్, సంఘ సభ్యులు, మహిళా మండలి సభ్యులు ,యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మ కు శ్రావణ మాస పూజలు

**యాడికి, ఆగష్టు 14,,అనంత జనశక్తి న్యూస్**




మండల కేంద్రంలోని కోన రోడ్డు వద్ద శ్రీ చౌడేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలు ప్రారంభించారు.ఉదయం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మకు సుప్రభాత సేవ, గంగా పూజ, పంచామృతాలతో అభిషేకం చేసి,నూతన పట్టు వస్త్రాలచే,వివిధ పూలమాలతో అలంకరణ చేశారు. అర్చనలు చేసి,ప్రత్యేక హారతులను సమర్పించారు. సాయంత్రం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శిచి, టెంకాయలను, కానుకలను సమర్పించారు. ఖడ్గా పద్యాలు పాడినారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరి దేవాలయం ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమైన శ్రీ సత్యసాయి జిల్లా

## జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**




శ్రీ సత్యసాయి జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు.ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పుట్టపర్తి స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత సురన ..లతో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేదిక, డెకరేషన్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.శనివారం (ఆగస్టు 15) ఉదయం 9 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజలు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొననున్న ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఈఓ క్రిస్టప్ప , డీఆర్డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అగాపే ఆశ్రమం లో అన్నదానం

**యాడికి, ఆగష్టు 13, అనంత జనశక్తి న్యూస్**

**మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమం లో వృద్ధులకు శుక్రవారం అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. పేరం లక్ష్మినారాయణ రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు భార్య ప్రమీలమ్మ, కుమారుడు రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , నాగార్జున, సాయి, వెంకట్ రెడ్డి,కోన రెడ్డి లు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. పేరం లక్ష్మినారాయణ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని,కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు. ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.**



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం

**అనంతపురం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా స్థానిక పోలీస్ పెరియడ్ గ్రౌండ్ లో జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సర్వం సిద్ధం చేసినట్లు డిఆర్ఓ మాలోల తెలిపారు.ఈసందర్భంగాపతాకావిష్కరణ, వేదిక పనులు ,స్టాల్స్, శకటాల ఏర్పాట్లు, మైదానం అలంకరణ, సిట్టింగ్ అరేంజ్మెంట్స్ తదితర పనులను డిఆర్ఓ పరిశీలించారు. వేడుకలలో భాగంగా రాష్ట్ర ఆర్థిక మరియు ప్రణాళిక వాణిజ్య పనులు మరియు శాసనసభ వ్యవహార శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ గారు పతాకావిష్కరణ చేసి ప్రజలకు వేడుకల సందర్భంగా సందేశమి స్తారని తెలిపారు. పరేడ్ కమాండ్ చే రాష్ట్రీయ సెల్యూట్ సమర్పణ, మార్చ్ ఫాస్ట్, సకటాల ప్రదర్శన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అన్ని కార్యక్రమాలను సజావుగా నిర్వహించేలా ఏర్పాటులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ డి ఓ ప్రేమంథకుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున్ రెడ్డి, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూ కొఠారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రమేష్ రెడ్డి తాసిల్దారులు రాజా ,ఉదయ భాస్కర్, ఆర్. ఐ .తేజ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి సత్యకుమార్ చొరవతో మెరుగైన వైద్య సేవలు

## -ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో నూతన ఓపీ కౌంటర్ ప్రారంభం.....

**ధర్మవరం ఆగష్టు 13 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో నూతన ఓపీ కౌంటర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, సత్య కుమార్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి శానిటరీ ఇంచార్జ్ బిల్లే. శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. కొత్త ఓపీ కౌంటర్ ఏర్పాటుతో రోగులకు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ఓపీ నమోదు మరింత సులభతరం కానుంది. ప్రత్యేక కౌంటర్ ద్వారా వేగంగా ఓపీ నమోదు చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశం కలుగుతుందని బిల్లే. శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా మంత్రి సత్యకుమార్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.



అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం

శనివారం | రంగారెడ్డి
15.08.2026



# విష జ్వరాలపై అప్రమత్తత ఏదీ?

- గిరిజన పల్లెల్లో జ్వరాల జోరు
- దోమల నివారణ చర్యలు శూన్యం
- ఏజెన్సీలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి సారించాలి

**మణుగూరు, ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్ :**



వర్షాకాలంలో పినపాక నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు విజృంభిస్తున్నా నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఈ విషయాన్ని ప్రకటన ద్వారా తెలిపారు. పలు గిరిజన పల్లెలు, గూడేల్లో ప్రజలు జ్వరాలతో మంచం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిల్వ నీరు, మురుగు కాలువలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. మురుగు కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలు, జనావాసాలు, పాఠశాలల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి జ్వర బాధితులకు పరీక్షలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాత స్పందించకుండా వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజారోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కర్నె రవి కోరారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు




- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి
- డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై కలెక్టర్ అంకిత్ పరిశీలన

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్**

కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో వేదిక, అతిథుల గ్యాలరీ, స్టాళ్లు, కూర్చునే ప్రదేశాలు, అలంకరణ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్, రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిమిషం వారీ కార్యక్రమాలను పరిశీలించి, నిర్ణీత సమయానికి కార్యక్రమాలు సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా జరగనున్న డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా వేదిక, కూర్చునే ప్రదేశాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీఎం డైరెక్షన్‌తోనే

# భూముల నిషేధం

- ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు
- ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా..
- భూములను నిషేధిత జాబితాలో పెడ్తున్నారు

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్టార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి పూర్తి చేయాలి

- నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి.. నాణ్యతలో రాజీ వద్దు
- తాగునీటికి ప్రాధాన్యత.. నీటి వృథాను అరికట్టాలి
- వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్ :**





జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఇల్లందు పట్టణంలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. రూ.37.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి, డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, రోగులకు అన్ని విభాగాలు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఇల్లందు చెరువును పరిశీలించిన కలెక్టర్ నీటి నిల్వలు, తాగునీటి వినియోగం, సాగునీటి పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ పొదుపుగా వినియోగించాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, ముఖ్యంగా పెసర సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, భోజనం, వసతి తదితర వివరాలను తెలుసుకున్నారు. గత ఏడాది సాధించిన వంద శాతం ఉత్తీర్ణతను ఈ ఏడాది కూడా కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పాఠశాల భవనం, భోజనశాలలో ఉన్న లీకేజీలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లోని బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం అందించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనల్లో తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో ధన్సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్, వ్యవసాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సేవలకు ఘన సత్కారం

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటిన సేవలకు ప్రశంస పత్రాలు

**రంగారెడ్డి ఆగస్టు 14 (అనంత జనశక్తి న్యూస్)**




తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పని చేసిన ఉద్యమకారుల సేవలను గుర్తిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా సత్కరించారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ, ఎల్బీనగర్ ఇన్‌చార్జి బీరెల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కంఠం సైదులుకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో వారి పాత్రను ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ కొనియాడారు. ఉద్యమం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మరి కొంతమంది ఉద్యమకారులు ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన ఉద్యమకారులకు ప్రశంస పత్రాలను అందజేశారు ప్రశంసా పత్రాలను అందుకున్న వారు నర చంద్రశేఖర్ రెడ్డి, ఈ. అశోక్ కుమార్, కడిమల గోపాల్, బొమ్మకంటి శ్రీనివాస్, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన చింతపట్ల రవీందర్, అనంత కుమార్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కోసం సాగిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, ఉద్యమకారుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ బీరెల్లి వెంకట్ రెడ్డి నాయకులు అన్నారు.

# రక్తదానం.. ప్రాణదానం

- రక్తదాతలే నిజమైన హీరోలు: డీఎంహెచ్ఓ
- డాక్టర్ తుకారాం రాథోడ్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్**



రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమని తెలిపారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సఫాయి బస్తీలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి నిల్వలు, పరిసరాల పరిశుభ్రత, దోమల వృద్ధి ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి శుక్రవారం డ్రై డేను సమర్థవంతంగా నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను పెంచడంతో పాటు, అంచనా ప్రసవ తేదీ ప్రకారం గర్భిణులను ఆసుపత్రుల్లో ప్రసవించేలా ప్రోత్సహించాలని, అధిక ప్రమాద గర్భిణులను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ తదితర అసాంక్రమిక వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, బాధితులకు క్రమం తప్పకుండా మందులు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్, డాక్టర్ సీతారాం, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ సురేందర్, ఆరోగ్య సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతకు పురస్కారం

- ప్రజల భద్రతే లక్ష్యంగా.. విధి నిర్వహణలో విశిష్ట సేవ
- సైబర్ సీఐ సముద్రాల జితేందర్ కు అరుదైన గౌరవం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్ :**

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యం కల్పిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైబర్ క్రైమ్ సీఐ సముద్రాల జితేందర్ కు శుక్రవారం అరుదైన గౌరవం దక్కింది. సైబర్ నేరాల స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తూ, మోసగాళ్ల వలలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ సందేశాలు, అనుమానాస్పద లింకులు, బ్యాంకింగ్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయడంలో ముందుంటున్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా.. నేరం జరగకముందే ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రజల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లను గుర్తించే దిశగా కృషి చేస్తున్నారు. పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం కలిగించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజల ఆస్తులు, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల భద్రతకు నిరంతరం సూచనలు అందిస్తున్నారు. ఈ సేవలను గుర్తించిన పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆయన కృషిని అభినందించారు. డీజీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారం ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా.. ప్రజల భద్రత కోసం పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి దక్కిన గౌరవంగా పలువురు పేర్కొన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతికతతో పాటు ప్రజల అప్రమత్తత కూడా కీలకమనే సందేశాన్ని ఆయన సేవలు చాటుతున్నాయి. పోలీసు అంటే కేవలం నేరం జరిగిన తర్వాత రంగంలోకి వచ్చేవారు కాదు.. నేరం జరగకుండా ప్రజలను కాపాడేవారే నిజమైన పోలీసు అనే భావనను ఆయన సేవలు ప్రతిబింబిస్తున్నాయి. ప్రజల భద్రత కోసం నిబద్ధతతో పనిచేస్తున్న సైబర్ క్రైమ్ సీఐకు లభించిన ఈ పురస్కారంపై జిల్లా పోలీసు వర్గాలు, ప్రజలు అభినందనలు తెలిపారు.



# ఫులే దంపతుల స్ఫూర్తితో విద్యా విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేయకుండా ఈ ఏడాది నుంచి క్రమం తప్పకుండా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ముందస్తుగానే రూ.2,400 కోట్లు, అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.250 కోట్లు అడ్వాన్స్ గా పెడుతోందని వెల్లడించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం అనే పరిస్థితి ఇకపై ఉండదని హామీ ఇచ్చారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాలకు పంపించే బాధ్యత, క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలతో పాటు భారీ నగదు నజరానాలు అందించే బాధ్యత తనదని 'రేవంతన్న'గా భరోసా ఇచ్చారు.

**కుల గణనతో చరిత్ర సృష్టించాం.. బలహీన వర్గాలకు పిలుపు..**

సమాజంలో జంతువులు, చేపల లెక్కలు కూడా ఉండేవి కానీ, బలహీన వర్గాల జనాభా ఎంత ఉందో స్పష్టమైన లెక్కలు లేవని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి , గొప్పలు చెప్పుకునే ప్రధాని మోదీకి సవాలు విసురుతూ.. గుజరాత్‌లో కూడా చేయని విధంగా తెలంగాణలో ధైర్యంగా బీసీ కుల గణన చేపట్టి బలహీన వర్గాల సంఖ్యను తేల్చామని చెప్పారు. అసెంబ్లీలో వ్యతిరేకతలు ఎదురైనా ప్రత్యేక కమిషన్ వేసి విజయవంతంగా సర్వే పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వాల ఆలోచన బీసీలను గొర్రెలు, బర్రెలు, చేపలు పట్టే పనులకే పరిమితం చేయాలని ఉండేదని, ఎందుకంటే చదువుకుంటే రాజ్యాధికారం అడుగుతారనే భయమే దానికి కారణమని విమర్శించారు.

**చదువుకోవాలి.. రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి**

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు రాష్ట్రంలో సంచలనాత్మక సామాజిక మార్పుకు వేదికగా నిలవబోతున్నాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. "మీరంతా బాగా చదివి సమాజంలో మార్పు తీసుకురావాలి, ఎమ్మెల్యేలు , ప్రజాప్రతినిధులుగా ఎదిగి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఇలాంటి ప్రభుత్వాన్ని నిరంతరం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



# ముఖంపై మొటిమలు, మచ్చలు తగ్గించే కలబంద, స్టీమ్ కాంబినేషన్



ప్రకృతి మనకి అందించిన అద్భుతమైన రహస్యాల్లో కలబంద ఒకటి. కలబందను పూర్వకాలం నుంచి అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడే సంజీవనిగా అధ్యయనం పేర్కొంది. నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో తీవ్ర ఒత్తిడి, కాలుష్యం, కలుషిత ఆహారం వంటి కారణాల వల్ల చర్మం తన సహజ సిద్ధమైన మెరుపును కోల్పోతుంది. అలసిన ముఖం, ముఖంపై ముడతలు, మొటిమలు మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అద్దంలో చూసుకున్నప్పుడు మనకే ఒక రకమైన ఆత్మనూన్యత కలుగుతుంది.



అయితే.. ఈ సమస్యలను తొలగించుకోవడానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఎలాంటి ఖర్చు లేకుండా మన ఇంటి దగ్గర లభించే కలబందతో అద్భుతాలు చేయొచ్చు. ముఖ్యంగా వేడినీటి ఆవిరితో కలిపి కలబందను ఉపయోగించడం అనేది ఒక అద్భుతమైన కాంబినేషన్ అనే చెప్పాలి. వేడి నీటి ఆవిరి చర్మ రంధ్రాలను సున్నితంగా తెరిచి లోపలి మురికిని బయటకి పంపితే, కలబంద చర్మ రంధ్రాల లోతుల్లోకి వెళ్లి చర్మానికి ప్రాణం పోస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల ముఖంపై పేరుకున్న మలినాలు తొలగిపోయి చర్మం మృదువుగా మారుతుంది.

**అలోవెరా + హాట్ వాటర్ స్టీమ్ ప్రయోజనాలు**

ముఖానికి ఆవిరి పట్టడం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. అప్పుడు కలబంద జెల్ ఉపయోగించడం వల్ల చర్మ లోపలి పొరల వరకు వెళ్లి పోషణను అందిస్తుంది. చర్మ కణాల్లో పేరుకుపోయిన జిడ్డు, మురికి, మృతకణాలను తొలగిస్తుంది. అంతే కాకుండా అలోవెరాలో సుమారు 95 శాతం నీరు ఉంటుంది.

కాబట్టి ఇది చర్మానికి తేమను అందిస్తుంది. ఇక అలోవెరాలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలు రావడానికి కారణమయ్యే బ్యాక్టీరియాను నశింపజేస్తాయి. అలోవెరా, వేడి నీటి ఆవిరి కాంబినేషన్ రక్తప్రసరణను మెరుగుపరిచి ముఖానికి సహజమైన కాంతిని ఇస్తుంది. చర్మంపై ఉన్న ముడతలను తగ్గించి యవ్వనంగా ఉంచుతుంది.

**అలోవెరా + హాట్ వాటర్ స్టీమ్ ప్రాసెస్**


మొదట ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇప్పుడు కొంచెం కలబంద జెల్ తీసుకుని ముఖంపై ఒక లేయర్‌లా 5 నిమిషాల పాటు మర్దన చేయండి. తర్వాత ఒక గిన్నెలో కొన్ని నీళ్లు తీసుకుని బాగా మరిగించండి. నీళ్లు మరిగాక స్టవ్ ఆఫ్ చేసి ఆ గిన్నెను దించి ఒక చోట పెట్టుకుని ఒక టవల్ లేదా బెడ్‌షీట్ కప్పుకుని గిన్నెలో నుంచి ఆవిరి ముఖానికి తగిలేలా చూసుకోండి.

ముఖాన్ని గిన్నెకు మరీ దగ్గరగా పెట్టకండి. ఇలా ఓ 5 నిమిషాల పాటు ఆవిరి పట్టండి. ఆ తర్వాత ముఖాన్ని శుభ్రంగా కడిగేసుకుని ఒక మెత్తటి గుడ్డతో స్మూత్‌గా తుడుచుకోవాలి. కొద్దిసేపటి తర్వాత మంచి మాయిశ్చరైజర్ రాసుకోండి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పొడి చర్మం ఉండే వాళ్లు వారానికి ఒకసారి, జిడ్డు చర్మం ఉండే వాళ్లు వారానికి రెండు సార్లు చేసుకుంటే సరిపోతుంది.

సున్నితమైన చర్మం ఉన్న వాళ్లు ఆవిరిపట్టే సమయాన్ని 3 నిమిషాలకు కుదించుకోండి. ఆవిరి పడితే చర్మానికి హాయిగా ఉండాలి కానీ మంట పుట్టకూడదు.



కలబంద, వేడినీటి ఆవిరితో పాటు కొంచెం రోజ్ వాటర్ కూడా కలుపుకుంటే మంచి సువాసన ఉంటుంది.

అలోవెరా జెల్ ఉపయోగించే ముందు చేతిపై కొంచెం ప్యాచ్ టెస్ట్ చేసుకోండి.

ఆవిరి పట్టే సమయంలో కళ్లు మూసుకోవడం మంచిది.



# గోధుమ పిండి, శనగ పిండి, మైదా పిండికి పురుగులు పట్టకుండా పాటించాల్సిన చిట్కాలు



వంటిల్లు మన ఆరోగ్య భాండాగారం. వంటింటిలో మనం నిల్వ చేసే ప్రతి వస్తువు వెనుకు ప్రత్యేకమైన శ్రద్ధ అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో పిండి పదార్థాల పాత్ర చాలా కీలకమైనది. ఉదయం, సాయంత్రం పూట చపాతీలు, సాయంత్రం కరకరలాడే బజ్జీలు, నోరూరించే పిండి వంటలు ఇలా ఏది చేయాలన్నా గోధుమ పిండి, శనగ పిండి, మైదా పిండి అవసరం. అయితే ఇక్కడ ఒక సమస్య ఉంది.



అదేమిటంటే.. వీటిని మనం పట్టించుకున్నా, కొనుక్కున్నా పిండి అయినా వాటికి చిన్నపాటి తేమ తగిలినా లేదా నిల్వ చేయడంలో ఏమాత్రం అశ్రద్ధ వహించినా పురుగులు చేరి ఆ పిండిని నాశనం చేస్తాయి. దీనివల్ల ఆ పిండి వృథా అవ్వడమే కాకుండా.. ఆ పిండిని వాడితే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మన అమ్మమ్మలు, నానమ్మలు పిండి నిల్వ చేయడంలో పాటించే చిట్కాలను ఇప్పుడు తెలుసుకుందాం..

**గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ**

సాధారణంగా గోధుమ పిండి, శనగపిండి, మైదా పిండి వంటి వాటిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయాలి. పిండి నిల్వ ఉంచే డబ్బాల మూత వదులుగా ఉంటే గాలి చొరబడి పిండికి పురుగులు పడతాయి. కాబట్టి పిండిని ఎయిర్‌టైట్ కంటైనర్లలో నిల్ల చేయడం మంచిది.

అయితే పిండిని గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ ఉంచినా సరే.. అప్పుడప్పుడూ బయట తీసి కాసేపు ఎండలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల పిండిలో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. కాబట్టి పిండిని కొద్దిగా ఉపయోగించగానే





ప్యాకెట్లలోనే ఉంచకుండా గాలి తగలని డబ్బాల్లో నిల్వ చేయాలి.

**బిర్యానీ ఆకులు, లవంగాలు వేయడం వల్ల..**

సాధారణంగా చెక్క, లవంగాలు, బిర్యానీ ఆకులు వంటి వాటిని మనం బిర్యానీలు మరియు నాన్వెజ్ వంటకాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. అయితే గోధుమ, శనగ, మైదా పిండి స్టోర్ చేసే డబ్బాల్లో రెండు మూడు బిర్యానీ ఆకులు, 4 లేదా 5 లవంగాలు వేయడం వల్ల ఆ వాసనకు పురుగులు దరిచేరవు. దీంతో పిండి ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

**పిండి రకాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి**

చాలా మంది తెలిసో తెలియకో నిల్వ ఉంచిన పిండిలో కొత్తగా తీసుకొచ్చిన పిండిని కలుపుతుంటారు. ఇలా చేయడం వల్ల మొత్తం పిండికి పురుగు పట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి పాత పిండిని మొత్తం ఉపయోగించడం లేదా రెండింటినీ వేరువేరు డబ్బాల్లో నిల్వ చేయడం మంచిది. పిండి నిల్వ ఉంచే డబ్బాలను కడిగి బాగా తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడిచి పూర్తిగా ఆరిన తర్వాత పిండిని నిల్వ చేయాలి.

అలాగే పిండిని నిల్వ చేయడానికి ప్లాస్టిక్ డబ్బాలకు బదులుగా గాజు సీసాలను వినియోగించడం మంచిది. ఇక శనగ పిండి త్వరగా పాడవుతుంది కాబట్టి దీనిని ఫ్రిజ్‌లో నిల్వ చేయడం ఉత్తమం. ఇక గోధుమ పిండి ఎక్కువ మొత్తంలో పట్టించినప్పుడు అందులో కొంచెం ఉప్పు కలిపి నిల్వ చేస్తే పురుగు పట్టదు.


# రెండు జతల డ్రెస్‌లతో హాలీడే ట్రిప్.. క్యూట్ ఫొటో పంచుకున్న సమంత



నటి సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీలో ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సామ్.. తాజాగా ఓ క్యూట్ ఫొటోను పంచుకున్నారు. "నా దగ్గర చాలా డ్రెస్‌లు ఉన్నాయి. కానీ, ఇప్పుడు నాకు అవేవీ సరిపోవడం లేదు. ఆ విషయం తెలిసి 'మినీ బ్రేక్‌డౌన్' వచ్చింది. రెండు సెకన్లు కంగారు పడ్డాను. ఏది ఏమైనా.. ఈ హాలిడేకి కేవలం 2 జతల డ్రెస్‌లు మాత్రమే సర్దేస్తున్నా" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతోంది.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాతృత్వం గురించి సమంత మాట్లాడారు. తాను ఈ క్షణాల కోసం ఎంతో ఎదురుచూసినట్లు చెప్పారు."అమ్మ' అనే పిలుపు కోసం ఎంతో పరితపించాను. . ఈ ప్రయాణంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నాను. ప్రతి రోజూ కొత్తగా అనిపిస్తోంది" అని అన్నారు. ప్రస్తుతం సమంత కొంతకాలం సినిమాల నుంచి విరామం తీసుకున్నారు.

# 'సనాతన ధర్మం'పై నా మాటలు వక్రీకరించారు: అనసూయ పోస్ట్



నటి అనసూయ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల హిందూ ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సనాతన ధర్మాన్ని అవమానించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై అనసూయ స్పందిస్తూ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. తన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించారని, తాను ఏ మత విశ్వాసాలనూ కించపర్చేలా మాట్లాడలేదని వివరణ ఇచ్చారు.


"నా మాటలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారు. అందుకే ఈ వివరణ ఇవ్వాల్సి వస్తోంది. నేను మాట్లాడింది కొంతమంది గురించి మాత్రమే. నాపై అభ్యంతర కామెంట్లు చేస్తూ, వ్యక్తిగత దాడులు, బెదిరింపులకు దిగే వాళ్ల గురించే నేను చెప్పాను. అది ఏ మతాన్ని గానీ, వర్గాన్ని గానీ ఉద్దేశిస్తూ చెప్పిన మాట కాదు. నన్ను టార్గెట్ చేస్తున్న వాళ్లకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను సనాతన ధర్మాన్ని పాటించే హిందువుని. నా ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల నాకు ఎలాంటి చింత లేదు. ధైర్యంగా ఉండటం.. నిజం వైపు నిలబడటం, తప్పును తప్పు అని చెప్పడం, ఎదుటివారిని మనిషిగా గౌరవించడం.. ఇవన్నీ నాకు ధర్మమే నేర్పింది. హనుమాన్ జీ ధైర్యం, బలమే నాకు స్ఫూర్తి. అందువల్ల అన్యాయం జరిగినప్పుడు మాట్లాడకుండా ఉండలేను. నా మాటల నుంచి అసలు విషయం తొలగించి.. సనాతన ధర్మాన్ని అవమానించినట్లుగా వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదు. మతం ఆధారంగా నేను ఎవరిపైనా ఓ నిర్ణయానికి రాను. వేధించే వాళ్లను మాత్రమే ప్రశ్నిస్తా. అందువల్ల ఎడిట్ చేసిన క్లిప్‌లు, సగం సగం కథనాల వలలో పడకండి. అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాతే ఓ అభిప్రాయానికి రండి" అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# నా అనుభవమే వారికో హెచ్చరిక!



తెరపై ఆడిపాడుతూ.. ప్రేక్షకులకు వినోదాన్ని పంచే తారల జీవితాల వెనుక కూడా ఎన్నో సమస్యలు ఉంటాయి. ఈ క్రమంలోనే తనదైన నటనతో కుర్రకారుని ఉర్రూతలూగించే నాయిక అనుపమ పరమేశ్వరన్ గత రెండేళ్లుగా నరకం అనుభవించానని, ప్రతి రాత్రి ఏడ్చేదాన్నని అంటోంది. ఈమధ్యే ఆమె 'మనశ్శాంతి దక్కాలంటే కొన్ని డెడ్‌ఎండ్స్ దాటి ముందుకు వెళ్లాలి' అంటూ పోస్ట్ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ.. ఆ పోస్ట్ వెనుక అసలు నిజాన్ని పంచుకుంది. "ఆ పోస్ట్ ఏదో రాత్రికి రాత్రి పెట్టింది కాదు. దాని వెనుక రెండేళ్ల బాధ ఉంది. నేను పూర్తిగా కోలుకొని ధైర్యంగా నిలబడే స్థాయికి వచ్చిన తర్వాతే ఆ విషయాన్ని ప్రపంచంతో పంచుకున్నాను. తన గురించి, తన జీవితం గురించి ఓ గొప్ప విషయాన్ని గుర్తించి.. కోలుకోవడానికి, ఒక ముఖ్యమైన విషయాన్ని వ్యక్తపరచడానికి సమయం తీసుకున్న ఒక అమ్మాయి ప్రయాణం ఇది. నేను రెండేళ్ల పాటు నార్సిసిస్టిక్ అబ్యూజ్ (మానసిక వేధింపుల)ను ఎదుర్కొన్నాను. ఇన్‌స్టాలో నటి మడోన్నా దీని గురించి మాట్లాడిన ఓ వీడియో చూసినప్పుడు నా శరీరం భయంతో వణికిపోయింది. ఒక రిలేషన్‌షిప్‌లోకి వెళ్లాక అందంగా వికసించాల్సిన నేను.. రోజురోజుకూ బరువు తగ్గి కుంగిపోయాను. ప్రతి రాత్రి ఏడ్చేదాన్ని. నా పరిస్థితిని చూసి కొందరు నెగిటివ్ కామెంట్స్ చేశారు. మరికొందరు అర్థం చేసుకున్నారు. కానీ అసలు ఈ వేధింపులను గుర్తించలేని మూడో కేటగిరీ వ్యక్తుల కోసమే నేను నోరు విప్పతున్నాను. చాలా కాలం తర్వాత ఈ మానసిక గాయం నుంచి కోలుకున్నా. ఇటువంటి విషపూరితమైన బంధాలలో చిక్కుకున్న వారికి నా అనుభవం ఒక హెచ్చరికగా నిలవాలనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాల గురించి బహిరంగంగా మాట్లాడుతున్నా" అని చెప్పకొచ్చింది అనుపమ.

# శ్రీదేవి త్వరలో వస్తోంది




నటి శ్రీదేవి.. ఈ పేరు వింటే చాలు.. ఇప్పటికీ ఆమె నటించిన పాత్రలు ప్రేక్షకుల ముందు మెదులుతూనే ఉంటాయి. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి సినీప్రియుల్ని మెప్పించారీమె. గురువారం ఈ దివంగత నటి జయంతి. ఈ సందర్భంగా కథానాయిక ప్రియాంక చోప్రా.. ఆమె జీవిత చరిత్ర పుస్తకానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. 'ఎంప్రెస్-ది డెఫినిటివ్ బయోగ్రఫీ ఆఫ్ శ్రీదేవి' అనే పుస్తక ముఖచిత్రాన్ని పంచుకుంటూ సామాజిక మాధ్యమాల వేదికగా శ్రీదేవికి నివాళులర్పించింది. "మీరు ఎంతో గుర్తుకొస్తున్నారు. స్వర్గంలో ఉన్న మీకు జన్మదిన శుభాకాంక్షలు. శ్రీదేవి త్వరలో వస్తోంది" అని వ్యాఖ్యను జోడించింది ప్రియాంక. ఈ పోస్ట్‌ను శ్రీదేవి భర్త, నిర్మాత బోనీ కపూర్ రీపోస్ట్ చేయడం విశేషం. రచయిత ధీరజ్ యు.కుమార్ రచించిన ఈ పుస్తకం శ్రీదేవి సినీప్రయాణం, వ్యక్తిగత జీవితం గురించి తెలియజేయనుంది. 2023లోనే శ్రీదేవి జీవిత చరిత్ర పుస్తకంగా రాబోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తెరపై శ్రీదేవి బయోపిక్‌లో ఎవరు నటిస్తారు? దర్శకత్వం ఎవరు? లాంటి ప్రశ్నలకు సమాధానం కోసం కొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఇదే నా చివరి ప్రపంచ కప్ కావచ్చు




ఆగస్టు 15 నుంచే హాకీ ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. ఇందులో భారత్‌ను చివరిసారిగా 1975లో స్వర్ణం వరించింది. ఆ తర్వాత పతకం రాలేదు. ఈసారి ఎలాగైనా ఆ లోటును భర్తీ చేయాలనే లక్ష్యంతో టీమ్ఇండియా బరిలోకి దిగుతోంది. తనకు ఇదే చివరి ప్రపంచ కప్ కావచ్చని సీనియర్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ వ్యాఖ్యానించాడు. అదే దృక్పథంతో బరిలోకి దిగి గెలిచేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు.

"ఈ వరల్డ్ కప్ నాకెంతో స్పెషల్. ఇది నాకు నాలుగో ఎడిషన్. మేం ఒలింపిక్ మెడల్స్ గెలిచాం. కానీ, వరల్డ్ కప్‌లో పతకం అందుకోలేకపోయాం. ఇప్పుడున్న జట్టులో ప్రతి ఒక్కరి కల కూడా అదే. నావరకైతే ఇదే చివరి ప్రపంచ కప్ కావొచ్చు. అదే మైండ్‌సెట్‌తో బరిలోకి దిగుతా. ఇప్పటి వరకు మేం సాధించలేకపోయిన దానిని అందుకొనేందుకు ప్రయత్నిస్తాం. అదే సమయంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. మేం పోషించాల్సిన పాత్రపై స్పష్టత ఉంది. క్రమశిక్షణతో ఆడతాం. అప్పుడే గెలిచే అవకాశాలు మనకు మెరుగ్గా ఉంటాయి. జట్టులో ప్రతి ఒక్కరికీ గొప్ప అనుభవం ఉంది. అందరూ అద్భుతమైన టాలెంట్ ఉన్న ప్లేయర్లే. మా సన్నద్ధత కూడా చాలా బాగుంది. ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంటామని బలంగా చెప్పగలను. ప్రతి ట్రైనింగ్ సెషన్‌లోనూ మేం వందశాతం కష్టపడ్డాం. జట్టులోని ప్రతి ఒక్కరూ ఏదో సాధించాలనే లక్ష్యంతోనే ఉన్నారు. ఫిట్‌నెస్‌పై మా కోచ్ ప్రధానంగా దృష్టి పెట్టారు. ఎందుకంటే.. ఫిట్‌గా ఉంటే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ఆస్కారం ఎక్కువ. గోల్స్ కొట్టడం మీదనే కాకుండా.. డిఫెన్స్‌పైనా వర్కౌట్ చేశాం. ప్రత్యర్థి పాకిస్థానా? ఇతర జట్టా? అనేది ముఖ్యం కాదు. మా ప్రణాళిక ప్రకారం ఆడతాం. గెలిచి తీరుతాం" అని మన్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు.

ప్రపంచ కప్ పూల్ Dలో వేల్స్, ఇంగ్లాండ్, పాకిస్థాన్‌తోపాటు భారత్ ఉంది. తొలి మ్యాచ్ ఆగస్టు 15న సాయంత్రం 4.30 గంటలకు వేల్స్‌తో టీమ్ఇండియా తలపడనుంది. ఆగస్టు 17న ఇంగ్లాండ్(సాయంత్రం 6.30గంటలు), ఆగస్టు 19న పాకిస్థాన్‌ను(సాయంత్రం 6.30 గంటలు) భారత్ ఢీకొట్టనుంది. నెదర్లాండ్స్ వేదికగా వరల్డ్ కప్ జరగనుంది.

# 600వ టెస్టుకు నాయకత్వం గర్వంగా ఉంది.. ఆ బెర్తే మా లక్ష్యం




శనివారం నుంచి శ్రీలంకతో టీమ్ఇండియా తొలి టెస్టు మ్యాచ్‌లో తలపడనుంది. మరోవైపు టెస్టు సారథిగా శుభ్‌మన్ గిల్ సంవత్సర కాలం పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కిది 600వ మ్యాచ్. ఇలాంటి మైలురాయి టెస్టుకు నాయకత్వం వహించనుండటం గర్వంగా ఉందని కెప్టెన్ గిల్ వ్యాఖ్యానించాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున మ్యాచ్ ప్రారంభం కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంటుందని తెలిపాడు.

"కెప్టెన్ పాత్రలో నేను చాలా సౌకర్యంగానే ఉన్నా. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. కనీసం మేం ఏడు టెస్టుల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి మొదలుపెడతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే భారత్ 600వ టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి పోరుకు నాయకత్వం వహించడం గొప్ప గౌరవం" అని గిల్ తెలిపాడు.

**సమయం ఇవ్వాలి..**

"మెరుగ్గా మారేందుకు ఆటగాళ్లకు తగినంత సమయం ఇవ్వాలి. కొందరికి కాస్త ఎక్కువ టైమ్ పడుతుంది. అయినా సరే వారికి మద్దతుగా నిలుస్తాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ బాగా ఆడాడు. అతడు గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ - మేనేజ్‌మెంట్ మధ్య సంబంధాలు సరిగా లేవని వస్తోన్న ఆరోపణలన్నీ అవాస్తవం. మేం అనుకొన్నంత వేగంగా సాయి సుదర్శన్ ఇంప్రూవ్ కాలేదు. అయితే, మా స్క్వాడ్‌లోని 15 మందిపై నమ్మకం ఉంది. తుది జట్టు ఎలా ఉంటుందనేది ఇప్పడే చెప్పలేను. పేసర్ల విషయంలోనూ ఎంపిక కష్టంగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేస్తాడు. బౌన్స్‌ను రాబడతాడు. అయితే, ప్రసిద్ధ్ వార్మప్ మ్యాచ్‌లో చాలా చక్కగా బంతులేశాడు. సిరాజ్‌తోపాటు మరొక పేసర్ ఎవరనేది తేల్చడం కాస్త క్లిష్టమైన నిర్ణయమే. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఫైనల్ XIను ప్రకటిస్తాం" అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.

# టోకెన్ అమౌంట్ రూ.100కే జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ షేర్లు బదిలీ!

జంషెడ్‌పుర్ ఫుట్‌బాల్ క్లబ్ కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్లింది. టాటాల ఆధ్వర్యంలో నడిచిన ఈ క్లబ్‌ను చర్చిల్ బ్రదర్స్ సొంతమైంది. తాజాగా జంషెడ్‌పుర్ ఎఫ్‌సీలోని షేర్లను రూ.100 టోకెట్ అమౌంట్‌కే ట్రాన్స్‌ఫర్ చేయడం గమనార్హం. అయితే, ఇది మొత్తం డీల్ విలువ అయి ఉండకపోవచ్చని సమాచారం. ఇండియన్ సూపర్ లీగ్‌లో గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్ సంస్థ యాజమాన్యంలో జంషెడ్‌పుర్ ఫుట్‌బాల్ క్లబ్ ఆడే అవకాశం ఉంది. టాటా స్టీల్ డైరెక్టర్స్ కమిటీ 4.08 కోట్ల ఈక్విటీ షేర్లను బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది. కొనుగోలు ఒప్పందం మీద సంతకాలు కూడా జరిగాయి. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అప్రూవల్‌తోపాటు ఇతర ఫార్మాలిటీలు పూర్తయ్యేందుకు దాదాపు 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. టాటా స్టీల్ - చర్చిల్ బ్రదర్స్ సంస్థ డీల్‌లో జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ స్పోర్టింగ్ లైసెన్స్, 12 మంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌ల కాంట్రాక్ట్‌లు ఉంటాయి. తాము లైసెన్స్‌ను తీసుకుంటున్నట్లు ఇప్పటికే ఏఐఎఫ్ఎఫ్ దృష్టికి చర్చిల్ బ్రదర్స్ సంస్థ తెలియజేసింది. ఫెడరేషన్ ఆమోదం లభించిన వెంటనే జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ చర్చిల్ బ్రదర్స్ చేతికి వెళ్తుంది. టాటా స్టీల్ నిర్ణయం వెనుక..

భారత్‌లో ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దశాబ్దం కిందట జంషెడ్‌పుర్ క్లబ్ ను టాటా స్టీల్ ప్రారంభించింది. అయితే, ఇటీవల ఇండియన్ సూపర్ లీగ్‌లో ఆడేందుకు ఎంట్రీ ఫీజును యాజమాన్యం చెల్లించలేదు. ఈ డీల్‌కు కొద్ది రోజుల ముందు నుంచే క్లబ్ నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకుంది. టాటా ఫుట్‌బాల్ అకాడమీని మరింత విస్తృతపరిచి క్షేత్రస్థాయిలో గేమ్‌కు సహకారం అందించాలనేది లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు చర్చిల్ బ్రదర్స్‌కు షేర్స్‌ను బదిలీ నేపథ్యంలో టాటా స్టీల్‌కు జంషెడ్‌పుర్ ఎఫ్‌సీతో బంధం ముగిసినట్లయింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945